ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

పెద్దపల్లి

జిల్లా వార్తలు

3★

శనివారం 22 జూన్ 2024



బొగ్గు గనుల వేలంపై నిరసనలు 6లో..

కోల్‌బ్లాకుల వేలంలో పాల్గొనవద్దు 6లో..

మద్దతు ధరపై నిరాశ





పంటల మద్దతు ధరలను ప్రకటించిన కేంద్రం

గత ఏడాదితో పోల్చితే పెంపు తక్కువే

వరికి రూ.117, పత్తికి రూ.501

గిట్టుబాటు కాదంటున్న రైతులు

(ఆంధ్రజ్యోతి, పెద్దపల్లి)

ప్రతి ఏటా వ్యవసాయ రంగంలో పెరుగుతున్న పెట్టుబడులకు అనుగుణంగా మద్దతు ధరలను కేంద్ర ప్రభుత్వం పెంచడం లేదు. దీంతో పంటల సాగు రైతులకు లాభసాటిగా మారడం లేదు. వచ్చే అక్టోబరు నుంచి అమల్లోకి రానున్న పంటల ధరలను రెండు రోజుల క్రితం ప్రకటించింది. అయితే ధరలు ఆశించిన స్థాయిలో లేకపోవడంతో రైతులు నిరాశ నిస్పృహలకు గురవుతున్నారు. కేంద్ర ప్రభుత్వం పెంచిన మద్దతు ధరలు, గత ఏడాది కంటే ఈసారి తక్కువగానే ఉన్నాయి. సాగు వ్యయం మాత్రం గత ఏడాదితో పోల్చితే పెరిగింది. గత ఏడాది వరికి రూ.143, పత్తికి రూ.540, కందికి రూ.400, నువ్వులకు రూ.805, పెసర రూ.803, మొక్కజొన్నకు రూ.128 మద్దతు ధర పెంచగా, ఈ ఏడాది వరికి రూ.117, పత్తికి రూ.501, కందికి రూ.550, నువ్వులకు రూ.632 పెసరకు రూ.124, మొక్కజొన్నకు రూ.135 మాత్రమే పెంచారు. గత ఏడాది కంటే ఈసారి కంది, రాగులు, పొద్దు తిరుగుడుకు కొంత ఎక్కువగా పెరిగింది. సన్నరకాల వరి ధాన్యానికి మాత్రం కేంద్రం మద్దతు ధర ప్రకటించలేదు. జిల్లాలో వరి, పత్తి, మొక్కజొన్న పంటలు ఎక్కువగా సాగవుతాయి. కంది, వేరుశనగ, తదితర పంటలు చాలా తక్కువ విస్తీర్ణంలో సాగవుతాయి. నువ్వులు, పెసర, పొద్దు తిరుగుడు, మినుములు లాంటి పంటలు నామమాత్రంగా సాగవుతాయి. ఎక్కువగా సాగుచేసే పంటలకు మద్దతు ధర తక్కువగా పెంచి, నామమాత్రంగా సాగయ్యే పంటలకు కొంత ఎక్కువగా పెంచడంతో పెద్దగా లాభం ఉండదని రైతులు పేర్కొంటున్నారు.

గిట్టుబాటు కాని మద్దతు ధరలు

పత్తి సాగుకు ఎకరాకు సుమారు రూ.45 వేల ఖర్చు వస్తోంది. ఎకరాకు ఎనిమిది నుంచి 10 క్వింటాళ్ల పత్తికంటే ఎక్కువ దిగుబడి రావడం లేదు. ఎకరాకు ఏడు క్వింటాళ్ల పత్తి దిగుబడిని తీసుకుంటే క్వింటాకు రూ.7521 చొప్పున రూ.52,647 వస్తాయి. అందులోంచి రూ.45వేలు పెట్టుబడి తీయగా రైతుకు మిగిలేది రూ.7647 పత్తిని విక్రయించేందుకు మార్కెట్‌కు వెళ్లడానికి రవాణా ఖర్చులు క్వింటాలుకు రూ.500 ఖర్చు వస్తోంది. సొంతంగా సాగు చేసుకునే రైతు అయితేనే కొంత మిగులుతుంది. అదే కౌలు రైతు అయితే వరి సాగుకు ఎకరాకు సుమారు. రూ.27 వేలు ఖర్చవుతుంది. ఎకరాకు సగటున 23 క్వింటాళ్ల ధాన్యం దిగుబడి వస్తుంది. ప్రభుత్వానికి విక్రయించాలంటే మార్కెట్‌కు తరలించి ఆరబెట్టి, తూర్పార పడితే సుమారు మూడు క్వింటాళ్ల తరుగు వస్తుంది. ఇక 20 క్విం టాళ్లకు రూ.46 వేలు వస్తాయి. అంటే ఎకరాకు రూ.10 వేలు మిగులుతాయి. అది కూడా సొంతంగా సాగుచేస్తేనే ఎకరాకు రూ.9వేలు కౌలు ఉంది. ప్రైవేట్ వ్యాపారులు క్వింటాకు రూ.1900 చెల్లిస్తున్నారు. దీంతో రైతుకు మిగులుబాటు ఉండటం లేదు.

ప్రతి ఏటా పంటల సాగు వ్యయం పెరుగుతున్నది. గత ఏడాదితో పోల్చి తే ఈ ఏడాది సాగు వ్యయం బాగా పెరిగింది. విత్తనాలు, దుక్కులు దున్నేందుకు ట్రాక్టర్ కిరాయిలు, కూలీలు, విత్తనాల రేట్లు బాగా పెరిగాయి. వ్యవ సాయ పంపుసెట్లు, ట్రాక్టర్‌లాంటి వ్యవసాయ యంత్రాల ధరలు ఇబ్బడిముబ్బడిగా పెరిగాయి. ఇలా సాగు ఖర్చు పెరగడంతో కేంద్ర ప్రభుత్వం పెంచే మద్దతు ధరలు పెట్టుబడి ఖర్చుల పెరుగుదలతో సరి

పెరుగుతున్న సాగు వ్యయం..

పోవడం లేదని రైతులు పేర్కొంటున్నారు. కేంద్ర ప్రభుత్వం ఏటా పంటల మద్దతు ధరలు పెంచుతున్నా, పంటల సాగు వ్యయం అంతకంటే ఎక్కువ పెరుగుతోంది. పంట సాగు వ్యయానికి 50 శాతం అదనంగా కలిపి మద్దతు ధర ప్రకటించాలని గతంలో స్వామినాథన్ కమిషన్ కేంద్ర ప్రభుత్వానికి సిఫారసు చేసింది. కానీ కేంద్రం ప్రభుత్వం వాస్తవ వ్యయాన్ని పరిగణనలోకి తీసుకోకుండా సాగు ఖర్చును తక్కువగా చూపి దానికి 50 శాతం కలిపి మద్దతు ధర ప్రకటిస్తోందని రైతులు అంటున్నారు.

రా రైస్ డెలివరీ పూర్తిచేయాలి

- అదనపు కలెక్టర్ జీవీ శ్యామ్‌ప్రసాద్‌లాల్

పెద్దపల్లిటౌన్, జూన్ 21: ఖరీఫ్ 2022-23 గాను సీఎంఆర్ రా రైస్ డెలివరీని నిర్దేశిత గడువు లోగా తప్పని సరిగా పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ జీ.వి. శ్యామ్ ప్రసాద్ లాల్ మిల్లర్లను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ లోని తన ఛాంబర్‌లో శ్యామ్‌ప్రసాద్ లాల్ జిల్లాలోని రైస్ మిల్లర్లు, అధికారులతో ఖరీఫ్ సీఎంఆర్ రైస్ డెలివరీపై సమీక్షించారు. సీఎంఆర్ బాకీ ఉన్న రైస్ మిల్లర్లు సకాలంలో మిల్లింగ్ చేసి అప్పగించకపోతే మిల్లర్లపై చర్యలు తీసుకుంటామని అదనపు కలెక్టర్ హెచ్చరించారు.

విద్యపై అవగాహన కలిగి ఉండాలి

- అదనపు కలెక్టర్ జే.అరుణశ్రీ

పెద్దపల్లిటౌన్, జూన్ 21: పూర్వ ప్రాథమిక విద్యపై అంగన్‌వాడీ టీచర్లు సంపూర్ణ అవగాహన కలిగి ఉండాలని అదనపు కలెక్టర్ జే.అరుణశ్రీ పేర్కొన్నారు. శుక్రవారం అరుణశ్రీ కలెక్టరేట్ ఎదురుగా ఉన్న ఐఎంఏ హాల్‌లో అంగన్వాడీ టీచర్లకు సవరించిన పాఠ్యప్రణాళికపై ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమాన్ని జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడీ టీచర్లు తమ నైపుణ్యాలను పెంచుకొని అంగన్‌వాడీ కేంద్రంలోని ప్రతి విద్యార్థికి పూర్వ ప్రాథమిక విద్య సంపూర్ణంగా అందేలా చూడాలన్నారు. జిల్లా సంక్షేమ అధికారి రౌఫ్‌ఖాన్, పెద్దపల్లి సీడీపీవో కవిత, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

యోగాతో ఆరోగ్యం మెరుగు : డీఎంహెచ్‌వో

పెద్దపల్లిటౌన్, జూన్ 21: యోగాతో ఆరోగ్యం మెరుగుపడుతుందని డీఎంహెచ్‌వో డాక్టర్ కె. ప్రమోద్ కుమార్ తెలిపారు. అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం పెద్దపల్లి భూంనగర్‌లోని ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన యోగా దినోత్సవ కార్యక్రమంలో ప్రమోద్‌కుమార్ పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ, ప్రతిరోజు యోగా చేయడం వలన శారీరక, మానసిక ఆరోగ్యం మెరుగుపడుతుందన్నారు. కార్యక్రమంలో జిల్లా ఆయుష్ ఇన్‌చార్జ్ డాక్టర్ శ్రీవాణి, యోగా ఇన్‌స్పెక్టర్ డాక్టర్ నిహారిక, డాక్టర్ విమల, కుమారి, డాక్టర్ శ్రీవాణి, డాక్టర్ కేశవరెడ్డి, డాక్టర్ మమత, డాక్టర్ శ్రవణ్, ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ కావేటి రాజగోపాల్, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

చెరువులో మట్టి తీయకుండా అడ్డుకున్న గ్రామస్థులు

కాల్వశ్రీరాంపూర్, జూన్ 21: మండలంలోని గంగారం గ్రామంలోని కోణాలకుంట చెరువులో ఆ గ్రామానికి చెందిన కొంత మంది మట్టి తీసేందుకు ప్రయత్నిస్తుండగా గంగారం గ్రామ పరిధిలోని ఉషన్నపల్లె గ్రామస్థులు శుక్రవారం అడ్డుకున్నారు. ముదిరాజ్ సంఘం వారు కొనుగోలు చేసిన భూమిలో మట్టి పోసి చేదును చేసేందుకు టాక్టర్ల ద్వారా మట్టి తరలిస్తున్న విషయాన్ని గ్రామస్తులు సమాచారం అందుకొని అడ్డుకోగా, ఇరువర్గాల మధ్య తోపులాట జరిగింది. దీంతో ముదిరాజ్ సంఘం వారు మట్టి తీయకుండా వెనుతిరగడంతో గొడవ సద్దుమణిగింది.

కలెక్టర్‌కు సన్మానం

కోల్‌సిటీటౌన్, జూన్ 21 : జిల్లా కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన కోయ శ్రీహర్షను జిల్లా ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సన్మానించింది. శుక్రవారం కలెక్టరేట్‌లో కమిటీ సభ్యులు, ఆలిండియా అంబేద్కర్ యువజన సంఘం నాయకులు బొంకూరి మధు, మామిడిపల్లి బాపయ్య, మంథెన లింగయ్య, లింగమూర్తి కలిశారు.

ఘనంగా ప్రపంచ సంగీత దినోత్సవం

కోల్‌సిటీటౌన్, జూన్ 21: గోదావరిఖని సింగరేణి ఎస్సీ, ఎస్టీ సంక్షేమ సంఘం స్ఫూర్తి భవన్‌లో గోదావరి కళా సంఘాల సమాఖ్య ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా ప్రపంచ సంగీత దినోత్సవం వేడుకలు నిర్వహించారు. కళా సంఘాల అధ్యక్షులు కనకం రమణయ్య అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో పలువురు కళాకారులు పాల్గొన్నారు.

అవార్డు ప్రదానం

కోల్‌సిటీటౌన్, జూన్ 21: అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా గోదావరిఖనిలోని కృష్ణవేణి వికాస్ జూనియర్ కళాశాల కరస్పాండెంట్ నాగండ్ల రవికుమార్‌ను నేషనల్ యూత్ ప్రాజెక్టు తెలంగాణ యూనిట్ ఆధ్వర్యంలో శుక్రవారం గోదావరిఖనిలో గురుబ్రహ్మ అవార్డుతో రవికుమార్‌ను సత్కరించారు.

బోర్ మోటార్‌ను ప్రారంభించిన చైర్‌పర్సన్

మంథని, జూన్ 21: స్థానిక అంబేద్కర్‌నగర్‌లో ఏర్పాటు చేసిన బోర్ మోటార్‌ను మున్సిపల్ చైర్‌పర్సన్ పెండ్రి రమ సురేష్‌రెడ్డి శుక్రవారం ప్రారంభించారు. గోటికార్ కిషన్‌జీ, సింగారపు కష్టయ్య, ప్రజలు పాల్గొన్నారు.

రోగులకు మెరుగైన వైద్య సేవలందించాలి

- కలెక్టర్ కోయ శ్రీ హర్ష



ఆసుపత్రి పనితీరును అడిగి తెలుసుకుంటున్న కలెక్టర్

పెద్దపల్లిటౌన్, జూన్ 21 : ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలను అందించాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టర్ శ్రీహర్ష జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జిల్లా ఆసుపత్రి, మాతా శిశు సంరక్షణ కేంద్రాలను తనిఖీ చేశారు. జిల్లా ఆస్పత్రిలో ఉన్న జనరల్ ఓపీ, దంత వైద్య విభాగం, కంటి వైద్య విభాగం, ఎముకలు, కీళ్లనొప్పుల విభాగం, ఆపరేషన్‌థియేటర్, జనరల్ వార్డ్, సైక్రియాటిక్ విభాగాలను కలెక్టర్ తనిఖీ చేసి ప్రజలకు అందిస్తున్న వైద్య సేవల వివరాల గురించి అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రికి సాధారణంగా ఓపీ ఎంతమంది రోగులు వస్తున్నారు, ఎటువంటి వ్యాధులు అధికంగా నమోదవుతున్నాయన్న అంశాలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. వైద్యం అందిస్తున్న రోగులకు వారి వైద్య చికిత్స కోర్స్ పూర్తి అయ్యే వరకు ఫాలోఅప్ చేయాలని, డ్యూటీలో ఉన్న వైద్యుల వివరాలు నోటీసుబోర్డుపై పరిశీలించిన కలెక్టర్ రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని వైద్య అధికారులకు సూచించారు. అనంతరం జిల్లా ఆసుపత్రి సమీపంలో గల మాతా, శిశు సంరక్షణ కేంద్రాన్ని కలెక్టర్ సందర్శించి ఓటి బ్లాక్, పోస్ట్ ఆపరేటివ్ వార్డ్, చిన్నపిల్లల ఓపీ, ఆరోగ్య మిత్ర, మందులు ఇచ్చే గది, పోస్ట్ నెటల్ వార్డు, రిసెప్షన్‌లను తనిఖీ చేశారు. ఆసుపత్రిలో ఉన్న రికార్డులను పరిశీలించిన కలెక్టర్ ప్రతి రోగి వివరాలు పకడ్బందీగా నమోదు చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. జిల్లా ఆసుపత్రి, మాతా శిశు సంరక్షణ కేంద్రంలో ఉన్న రోగులతో కలెక్టర్ మాట్లాడి ఆసుపత్రిలో అందుతున్న వైద్యసేవల వివరాలను అడిగి తెలుసుకున్నారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా ఆసుపత్రి, మాతా శిశు సంరక్షణ కేంద్రంలో పనిచేసే వైద్యులకు, వైద్య సిబ్బందికి, ఇతర సిబ్బందికి బయోమెట్రిక్ విధానం ద్వారా హాజరు నమోదుచేసేలా చర్యలు తీసుకోవాలని ఆసుపత్రి సూపరింటెండెంట్‌ను ఆదేశించారు. వైద్యులు సకాలంలో విధులకు హాజరు కావాలని అధికారులకు సూచించారు. మాతా, శిశు ఆసుపత్రిలో నెలకు ఎన్ని ప్రసవాలు అవుతున్నాయో అడిగి తెలుసుకున్న కలెక్టర్, ప్రభుత్వ ఆసుపత్రులలో ప్రసవాల సంఖ్య పెంచేందుకు చర్యలు తీసుకోవాలని, మరిన్ని ప్రసవాలు ప్రభుత్వ ఆసుపత్రిలో జరిగేలా చూడాలని కలెక్టర్ ఆదేశించారు.

ఈ తనిఖీలో కలెక్టర్ వెంట జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రమాకాంత్, సంబంధిత వైద్య, ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్ పర్యటన

పాలకుర్తి, జూన్ 21:కలెక్టర్ కోయ శ్రీహర్ష శుక్రవారం మండలంలో పర్యటించారు. బసంత్‌నగర్‌లోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల, జడ్పీ ఉన్నత పాఠశాలలను తనిఖీ చేశారు. తహసీల్దార్ కార్యాలయం, బసంత్‌నగర్ ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలించారు. మండల పరిషత్ పాఠశాలలో తరగతి గదులను పరిశీలించారు. తహసీల్దార్ కార్యాలయంలో పనిచేస్తున్న సిబ్బంది, వారి విధుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. పెండింగ్‌లో ఉన్న ధరణి దరఖాస్తుల వివరాలను ఆరాతీశారు. మండల పరిధిలో అక్రమంగా ఇసుక,మట్టి తరలింపు జరగకుండా తహసీల్దార్ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

అంతర్గాం, జూన్ 21: అంతర్గాం, రామగుండం మండలాల్లో శుక్రవారం కలెక్టర్ కోయ శ్రీహర్ష ఆకస్మికంగా పర్యటించారు. అంతర్గాం, రామగుండం తహసీల్దార్ కార్యాలయాలను సందర్శించి రికార్డులు తనిఖీ చేశారు. అనంతరం అంతర్గాం పీహెచ్‌సీని సందర్శించారు. తహసీల్దార్లు పీ రాం మోహన్‌రావు, కుమారస్వామి రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

విజిబుల్ పోలీసింగ్‌పై దృష్టి పెట్టండి : సీపీ శ్రీనివాస్

కోల్‌సిటీ, జూన్ 21: పోలీసులు విజిబుల్ పోలీసింగ్‌పై దృష్టి పెట్టాలని, నిత్యం ప్రజల మధ్యలో ఉండాలని రామగుండం పోలీస్ కమిషనర్, ఐజీ శ్రీనివాస్ పేర్కొన్నారు. శుక్రవారం గోదావరిఖని మెయిన్ చౌరస్తాను పరిశీలించారు. పోలీసులు ప్రజలతో మమేకమై ఉండాలని, నడుచుకుంటూ పెట్రోలింగ్ చేయాలని సూచించారు. ప్రజల సమస్యలు, ఇబ్బందులు తెలుసుకుంటూ వారితో మమేకం కావాలన్నారు. ప్రజలకు, వాహనదారులకు ఎలాంటి ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. రద్దీ ప్రాంతాల్లో వాహనాలు తనిఖీ చేసి అనుమానితులను గుర్తించాలన్నారు. ఆయన వెంట అడిషనల్ డీసీపీ(అడ్మిన్) రాజు, గోదావరిఖని ఏసీపీ రమేష్ అధికారులు ఉన్నారు.



చౌరస్తాను పరిశీలిస్తున్న సీపీ శ్రీనివాస్

సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి...

కోల్‌సిటీ, జూన్ 21: సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తతో ఉండాలని, టెక్నాలజీ పెరిగినకొద్దీ సైబర్ నేరగాళ్లు కొత్త తరహాలో నేరాలకు పాల్పడుతున్నారని గోదావరిఖని వన్‌టౌన్ సీఐ ఇంద్రసేనారెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం గోదావరిఖని ఇందిరానగర్‌లో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఓటీపీ నెంబర్ అపరిచితులకు వ్యక్తులకు చెప్పవద్దని, అనుమానస్పద లింకులు ఓపెన్ చేయవద్దన్నారు. ఎవరైనా సైబర్ మోసానికి గురైతే 1930కు కాల్ చేసి చెప్పాలన్నారు. ప్రజలు తమ మైనర్లు అయిన పిల్లలకు వాహనాలు ఇవ్వవద్దని, సరదా కోసం వాహనాలు వేగంగా నడుపుతూ ప్రమాదాలకు గురవుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐలు సుగుణాకర్, సిబ్బంది పాల్గొన్నారు.

గోదావరిఖని టూటౌన్ పోలీస్ స్టేషన్‌ను సందర్శించిన సీపీ

ఫైటింక్లయిన్‌కాలనీ, జూన్ 21: గోదావరిఖని టూటౌన్ పోలీస్ స్టేషన్‌ను శుక్రవారం రామగుండం పోలీస్ కమిషనర్ ఎం శ్రీనివాస్ సందర్శించారు. స్టేషన్ ఆవరణలో అధికారులతో కలసి మొక్కలను నాటారు. రిసెప్షన్ సెంటర్‌లో రికార్డులను పరిశీలించారు. ఈసందర్భంగా స్టేషన్ సిబ్బంది వివరాలు, నిర్వహిస్తున్న విధులు అడిగి తెలుసుకున్నారు. స్టేషన్ పరిధి భౌగోళిక పరిస్థితులు, గనులు, ముఖ్యమైన ప్రాంతాలు, స్టేషన్‌పరిధిలోని గ్రామాల వివరాలను తెలుసుకున్నారు. ఏరకమైన నేరాలు జరుగుతున్నాయి, ఎక్కువ ఫిర్యాదులు దేనిపై వస్తున్నాయనే విషయాలతో పాటు స్టేషన్ పరిధిలో సమస్యాత్మక విషయాలు, పెండింగ్ కేసుల గురించి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదు దారులతో మర్యాదగా ప్రవరిస్తూ, కేసుకు సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకుని ఆలస్యం చేయకుండా పరిష్కరించేలా దృష్టి సారించాలని సిబ్బందికి సూచించారు. ప్రతి ఒక్కరు బాధ్యతాయుతంగా క్రమశిక్షణతో మెలగాలని సూచించారు. నైట్‌పెట్రోలింగ్, విజిబుల్ పోలీసింగ్ నిర్వహించాలని, బీట్లు, పెట్రోలింగ్ పకడ్బందీగా నిర్వహించాలని స్టేషన్ సిబ్బందికి సూచించారు. సీపీ వెంట అడిషనల్ డీసీపీ(అడ్మిన్) సీ రాజు, ఏసీపీ రమేష్, సీఐ బీ రవీందర్ ఉన్నారు.

అక్రమంగా నిల్వచేసిన ఇసుక సీజ్



ఇసుకను సీజ్ చేస్తున్న అధికారులు

ముత్తారం జూన్ 21: మండల కేంద్రమైన ముత్తారం గ్రామపంచాయతీ పరిధిలోని మానేరు రోడ్డున కొంతమంది వ్యక్తులు అక్రమంగా ఇసుకను డంపు చేసి ఉంచారు. దీంతో గ్రామస్థులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడంతో అధికారులు వచ్చి అక్రమంగా నిల్వ చేసిన ఇసుకను సీజ్ చేశారు. ఇసుక అంచనా విలువను గుర్తించి వేలంపాట ద్వారా విక్రయించనున్నట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు.

యథేచ్ఛగా ఇసుక అక్రమ తవ్వకాలు..

మండల కేంద్రానికి చెందిన ఇద్దరు నాయకులు మానేరు నుంచి ఇసుకను అక్రమంగా తరలించి సొమ్ము చేసుకుంటున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. సదరు నాయకుల్లో ఒకరు అధికార పార్టీ, మరొకరు ప్రతిపక్ష పార్టీకి చెందిన వారు కావడంతో అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. దీంతో మానేరులో జేసీబీలతో ఇసుకను తోడి లారీలలో తరలించి లక్షలు దండుకుంటున్నారే స్థానికులు ఆరోపిస్తున్నారు. గురువారం అర్ధరాత్రి తరువాత మానేరులో ఇసుక తవ్వకాల విషయమై కలెక్టర్‌కు ఫిర్యాదు చేశామని, అయినా స్థానిక అధికారులు ఏమీ పట్టనట్లు వ్యవహరించడంపై స్థానికులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఎట్టకేలకు శుక్రవారం మధ్యాహ్నం రెవెన్యూ, మైనింగ్ అధికారులు పరిశీలనకు వచ్చి, ముత్తారం కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం సమీపంలో ఎనిమిది లారీల ఇసుక ఎలాంటి అనుమతి లేకుండా డంపు చేసి ఉండడాన్ని గుర్తించి సీజ్ చేయడం గమనార్హం. ఇప్పటికైనా మానేరులో ఇసుక అక్రమ తవ్వకాలపై సమగ్రంగా విచారణ జరిపి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

పరీక్షల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు

- అదనపు కలెక్టర్ జే.అరుణశ్రీ



సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ అరుణశ్రీ

పెద్దపల్లిటౌన్, జూన్ 21: హాస్టల్ సంక్షేమ అధికారి, డివిజనల్ అకౌంట్స్ ఆఫీసర్ పరీక్షల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని అదనపు కలెక్టర్ జే.అరుణశ్రీ అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో పరీక్షల నిర్వహణపై సంబంధిత అధికారులతో అదనపుకలెక్టర్ సమీక్షించారు. ఈసందర్భంగా జే.అరుణశ్రీ మాట్లాడుతూ తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఖాళీగా ఉన్న హాస్టల్ సంక్షేమ అధికారులు, డివిజనల్ అకౌంట్స్ అధికారి పోస్టులకు నోటిఫికేషన్ విడుదల చేసి, దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఈనెల24 నుంచి 29వరకు హాస్టల్ సంక్షేమ అధికారులు, ఈనెల 30 నుంచి జూలై 4వరకు డివిజనల్ అకౌంట్స్ అధికారి పరీక్షలను నిర్వహిస్తోందన్నారు. జిల్లాలో మూడు పరీక్షా కేంద్రాలను ఏర్పాటుచేయగా, మంథని జేఎన్టీయూ ఇంజనీరింగ్ కళాశాల, పెద్దపల్లిలో ఉన్న ట్రినిటీ ఇంజనీరింగ్ కళాశాల, మదర్ థెరిస్సా ఇంజనీరింగ్ కళాశాలలో పరీక్షలు జరుగుతాయని తెలిపారు. డీసీపీ అడ్మిన్ సి.రాజు, సీఐ క్రిష్ణ, జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి మేరాజ్ మ హమ్మద్, కలెక్టరేట్ సి సెక్షన్ సూపరింటెం డెంట్ ప్రకాశ్, అధికారులు పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన ట్రైనీ ఐఏఎస్‌లు



కలెక్టర్ కోయ శ్రీహర్షతో మాట్లాడుతున్న ట్రైనీ ఐఏఎస్‌లు

గోదావరిఖని, జూన్ 21: ఇండస్ట్రియల్ టూర్‌లో భాగంగా 2022-23 బ్యాచ్‌కుచెందిన ఐఏఎస్‌లు శుక్రవారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్షను ఇల్లందు గెస్ట్‌హౌస్‌లో కలిశారు. ఏడుగురు ట్రైనీ ఐఏఎస్‌లు రామగుండం ఎరువుల కర్మాగారం, ఎన్టీపీసీ కర్మాగారంలో పర్యటించనున్నారు. పరిపాలన విభాగం ఆర్ఎఫ్‌సీఎల్, ఎన్టీపీసీ, ఇతర పరిశ్రమలపై ఐఏఎస్‌లకు అవగాహన కల్పించారు. మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ రాహుల్, రామగుండం ఇన్‌చార్జి తహసిల్దార్ తిరుపతి పాల్గొన్నారు.

జయశంకర్ సార్‌కు ఘన నివాళులు

పెద్దపల్లిటౌన్, జూన్ 21: ప్రొఫెసర్ జయశంకర్ సార్ వర్ధంతి సందర్భంగా తెలంగాణ ఉద్యమకారుల ఫోరం ఆధ్వర్యంలో శుక్రవారం అమరవీరుల స్థూపం వద్ద జయశంకర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. తెలంగాణ ఉద్యమకారుల ఫోరం పెద్దపల్లి జిల్లా అధ్యక్షులు గుండేటి ఐలయ్య యాదవ్, నూనె రాజేశం, బత్తుల శంకర్, పోసాని శ్రీనివాస్ యాదవ్, కసరపు ఐలయ్యగౌడ్, దుబ్బతి చంద్రకళ, నర్సక్క, లక్ష్మి, మధునమ్మ, రొత్తు సందీప్, కనకయ్య, మధు బాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

మంథని : ప్రొఫెసర్ జయశంకర్ వర్ధంతి సందర్భంగా మంథనిలోని ఆయన విగ్రహం వద్ద జడ్పీ చైర్మన్ పుట్ట మధు పూలమాల వేసి నివాళులర్పించారు. ఎమ్మెల్యే క్యాంపు ఆఫీసులో మంథని మున్సిపల్ చైర్‌పర్సన్ పెండ్రు రమ-సురేష్‌రెడ్డి, ఎంపీపీ కొండ శంకర్, కాంగ్రెస్ పార్టీ శ్రేణులు చిత్ర పటం వద్ద నివాళులర్పించారు.

ఎలిగేడు : మండల కేంద్రంలోని అంబేడ్కర్ చౌక్‌లో శుక్రవారం ప్రొఫెసర్ జయశంకర్ వర్ధంతి నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎంపీపీ తానిపర్తి స్రవంతిమోహన్‌రావు, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బైరెడ్డి రాంరెడ్డి, నాయకులు న్యాతరి పోచయ్య, కవ్వంపల్లి బాపయ్య, జల్లి రమేష్, బోయిని సతీష్, బద్దం తిరుపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తొమ్మిదేళ్ల చిన్నారిపై వృద్ధుడి లైంగిక వేధింపులు

- పోలీసులను ఆశ్రయించిన బాధిత కుటుంబం

- పోలీసుల అదుపులో వృద్ధుడు

సుల్తానాబాద్, జూన్ 21: పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్ మండలంలో చిన్నారిపై వృద్ధుడు లైంగిక వేధింపులకు పాల్పడ్డాడు. మండలంలోని రేగడిమద్దికుంట గ్రామానికి చెందిన ఓ కుటుంబం కూలీ పని చేసుకుని జీవిస్తోంది. వీరికి తొమ్మిదేళ్ల వయసుగల బాలిక ఉంది. చిన్నారి సమీప బంధువు తాత వరుసైన వృద్ధుడు(73) వారం రోజుల నుంచి బాలికను తరచూ డబ్బులు, చాక్లెట్లు, బిస్కెట్ల ఆశ చూపుతూ చిన్నారిని లైంగికంగా వేధింపులకు గురిచేస్తున్నాడని బాలిక తండ్రి తెలిపాడు. స్కూల్‌కు వెళుతున్న చిన్నారిని అడ్డుకుని లైంగికంగా వేధింపులకు గురిచేస్తున్నాడు. బాలిక భయపడుతూ తమకు చెప్పలేదని, స్కూల్‌కు వెళుతుంటే కాపు కాసి చిన్నారి స్కూల్ బ్యాగును పక్కన పడేసి పక్కకు పొదల్లోకి తీసుకెళుతున్నాడని చెప్పారు. అయితే శుక్రవారం ఏడుస్తూనే స్కూల్‌కు వెళితే కాసేపటికి తాను స్కూల్ నుంచి తన కూతురును ఇంటికి తీసుకువచ్చి ఏం జరిగిందని అడిగితే వారం రోజుల నుంచి వృద్ధుడి వేధింపులు చెప్పిందని ఆవేదన వ్యక్తం చేశాడు. దాంతో చిన్నారిని తీసుకుని పోలీసు స్టేషన్‌లో పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపాడు. ఈ మేరకు పోలీసు అధికారులు పాప వాంగ్మూలాన్ని నమోదు చేసుకున్నారని, వృద్ధుడిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారని తెలిపాడు. కాగా ఈ విషయమై పోలీసుల వివరణ కోసం సంప్రదించగా స్పందించలేదు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

గంగాధర, జూన్ 21: రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ గంగాధర మండలం లక్ష్మీదేవిపల్లికి చెందిన జలెందర్(33) అనే యువకుడు చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. గురువారం రాత్రి జలెందర్ బోయినపల్లి మండలం కొదురుపాక బ్రిడ్జి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికుల సమాచారం మేరకు కుటుంబ సభ్యులు కరీంనగర్‌కు తరలించారు. చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతి చెందాడు. జలెందర్ ఉపాధి నిమిత్తం దుబాయి వెళ్లి రెండు నెలల క్రితం వచ్చాడు. సోమవారం తిరిగి దుబాయి వెళ్లేందుకు విమాన టికెట్టు సైతం బుక్ చేసుకున్నాడని కుటుంబీకులు తెలిపారు. ఇంతలోనే రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో గ్రామంలో విషాదం నెలకొంది.

విద్యుదాఘాతంతో యువకుడి మృతి

మంథని, జూన్ 21: స్థానిక పోచమ్మవాడలో ప్రమాదవశాత్తు విద్యుదాఘాతంతో బుద్దార్తి వర్షిత్(18) యువకుడు శుక్రవారం మృతిచెందినట్లు ఎస్ఐ వెంకటకృష్ణ తెలిపారు. తన ఇంటి ముందు నిర్మించిన మరో ఇంటిలో విద్యుత్ వర్క్ చేస్తుండగా ప్రమాదవశాత్తు షాక్‌కు గురయ్యాడు. వర్షిత్‌ను స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు డాక్టర్ ధ్రువీకరించారు. తండ్రి బుద్దార్తి నవీన్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

ఎఫ్‌సీఐ బియ్యం బస్తాలు దొంగిలించిన ముఠా అరెస్టు

అంతర్గాం, జూన్ 21: మంచిర్యాల రైల్వేస్టేషన్‌లో ఆగి ఉన్న ఎఫ్‌సీఐ బియ్యం బస్తాల గూడ్స్ రైలు నుంచి 30క్వింటాళ్ల బియ్యం బస్తాలు దొంగిలించి రెండు ఆటోలలో తరలిస్తున్న నలుగురు నిందితులను శుక్రవారం అరెస్టు చేసి రిమాండ్‌కు పంపుతున్నట్టు రామగుండం ఆర్‌పీఎఫ్ సీఐ బుర్ర సురేష్‌గౌడ్ తెలిపారు. నిందితులు గుమ్ముల భీమయ్య, జనగామ దినేష్, కనుసోతు వెంకటేష్, అన్నెల వంశీలను మంచిర్యాల పట్టణంలో పట్టుకుని వీరితో పాటు రెండు ఆటోలు టీఎస్01యూబీ7552, టీఎస్19టీఏ6109లను అదుపులోకి తీసుకున్నట్టు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌పీఎఫ్ ఏఎస్ఐ శేఖర్‌రెడ్డి, డీ ఐలయ్య, సుమన్, ఆర్‌పీఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్టీపీసీలో వ్యక్తి ఆత్మహత్య



రమేశ్(ఫైల్)

జ్యోతినగర్, జూన్ 21: ఎన్టీపీసీ అన్నపూర్ణకాలనీలో శుక్రవారం కందుల రమేశ్(53) అనే వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఇంటి దూలానికి తాడుతో ఉరివేసుకొని బలవన్మరణానికి పాల్పడ్డాడు. కుటుంబ కలహాల కారణంగా రమేష్ ఆత్మహత్యకు పాల్పడి నట్లు ఎన్టీపీసీ పోలీసులు తెలిపారు. రమేశ్‌కు భార్య, ఇద్దరు కుమార్తెలు, కొడుకు ఉన్నారు. కొడుకు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎన్టీపీసీ పోలీసులు తెలిపారు.

యూనిసెఫ్ ప్రతినిధుల సందర్శన


తిమ్మాపూర్‌లో ఇంకుడు గుంతలను పరిశీలిస్తున్న యూనిసెఫ్ ప్రతినిధులు

తిమ్మాపూర్, జూన్ 21: తిమ్మాపూర్ గ్రామాన్ని కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ మూడు రా ్ రాష్ట్రాల యూనిసెఫ్ ప్రతినిధులు(40మంది) శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా గ్రామంలో బృదం సభ్యులు పర్యటించి పారిశుధ్యం, తాగునీరు సదుపాయాలను పరిశీలించారు. ఇళ్లల్లో తడి, పొడి చెత్త సేకరణ, వేరుచేయడం, కంపోస్ట్ తయారు చేయడం, దాన్ని అమ్మకం లాంటి వాటిని పరిశీలించి వివరాలను అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో నల్ల కనెక్షన్‌లు, ఇంకు డు గుంతలు, కిచెన్ గార్డెన్‌లు, టాయిలెట్లు, పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలను, మండల వైద్య కేంద్రాన్ని పరిశీలించారు. వాటి పనితీరును అడిగి తెలుసుకున్నారు. గ్రామ పంచాయతీలో కంపోస్ట్ స్టాల్, స్టీల్ బ్యాంక్, శానిటరీ టూల్స్ స్టాల్, వాటర్ టెస్టింగ్, పారిశుధ్య కార్మికుల సేఫ్టీ స్టాల్, గ్రామ పంచాయతీకి వచ్చిన అవార్డులతో ఏర్పాటు చేసిన స్టాల్‌లను పరిశీలించారు. పారిశుధ్య కార్మికులకు ఇన్సూరెన్స్, పీపీఈ కిట్స్, హెల్త్ చెకప్‌ను పరిశీలించారు. అనంతరం సమావేశం ఏర్పాటు చేసి గ్రామంలో చేపడుతున్న అభివృద్ధి పనులు బాగున్నాయని ప్రశం సించారు. కార్యక్రమంలో యూనిసెఫ్ హెచ్‌యఫ్‌వో వెంకటేష్, వాష్ కన్సల్‌టెంట్ ప్రభాత్, ఇఫి కర్ కన్సల్‌టెంట్ కాశీనాథ్, కన్సల్‌టెంట్‌లు, జిల్లా యూనిసెఫ్ కో ఆర్డినేటర్ కిషన్‌స్వామి, ఎస్ బీఎం రమేశ్, వేణు, ఎంపీడీవో విజయ్‌కుమార్, ఎంపీవో కిరణ్ కుమార్, గ్రామ పంచాయతీ కార్యదర్శి కె.మహేందర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

కళాకారులను ప్రోత్సహించాలి


జ్యోతి వెలిగిస్తున్న ఆర్డీవో మహేశ్వర్

- సంగీత దినోత్సవంలో ఆర్డీవో మహేశ్వర్

- అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

కరీంనగర్ కల్చరల్, జూన్ 21: కళలు అజరామరమని, కళలను, కళాకారులను ప్రోత్సహిం చాల్సిన అవసరం ఉందని ఆర్డీవో మహేశ్వర్ అన్నారు. శుక్రవారం ప్రపంచ సంగీత దినోత్సవం సందర్భంగా కరీంనగర్‌లోని ఫిలిం భవన్‌లో ప్రవీణ్ సల్వాజి మ్యూజికల్ గ్రూప్, సల్వాజి ఈవెంట్స్ సంయుక్తంగా నిర్వహించిన వేడుకకు ఆర్డీవో ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. భారతీయ కళలకు ఎంతో ప్రాధాన్యం ఉందని తెలిపారు. కళాకారులకు, కళలకు చేయూతని వ్వాలని, కళలతో మానసిక, శారీరక ప్రశాంతత సాధ్యమని తెలిపారు. ప్రతీ యేటా సంగీత దినోత్సవాన్ని జరుపుతూ కళాకారులను ఒకే వేదికపైకి తీసుకువచ్చి అందరికీ పరిచయం చేస్తోన్న సల్వాజి ప్రవీణ్‌ను అభినందించారు.


నృత్యం చేస్తున్న చిన్నారులు

సీనియర్ గాయకులు నామ్‌దేవ్, బొజ్జ రేవతి, గొల్లపల్లి రవీందర్, మురళి మధు, టి మోహనస్వామి, జి కృపాదానంతో పాటు సుమారు 10 జిల్లాల నుంచి వచ్చిన కళాకారులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సీనియర్ గాయ కుల పాటలతో పాటు సంగెం రాధాకృష్ణ బృందం, చిన్నారుల శాస్త్రీయ నృత్యాలు, రామకృష్ణ బృందం, విద్యార్థుల బ్రేక్ డాన్స్‌లు ఎంతగానో అలరించాయి. కార్యక్రమంలో ప్రొఫెసర్ తిరుపత య్య, అజయ్, గుండేటి రమేశ్, అనుముల దయాకర్, అభి, బాబు గౌరవేని, సల్వాజి సంధ్య, కళాకారులు తదితరులు పాల్గొన్నారు.

25 శాతం పెనాల్టీ జీవోను రద్దు చేయాలి


మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న బాధితులు

కరీంనగర్ టౌన్, జూన్ 21: వానాకాలం 2021-22కు సంబంధించిన రైస్ సీఎంఆర్ నిర్ణీత కాల వ్యవధిలో ఇవ్వనందున 25శాతం పెనాల్టీ విధిస్తూ ప్రభుత్వం జారీ చేసిన జీవోను రద్దు చేసి న్యాయం చేయాలని కరీంనగర్ రా రైస్ మిల్లర్స్, 25 శాతం పెనాల్టీ బాధితులు రాష్ట్ర పౌరసరఫరాలు, భారీ నీటి పారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని కోరారు. ఈ మేరకు పలువురు బాధితులు హైదరాబాద్‌లో మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. 2021-22 వానాకాలం సీజన్‌లో సివిల్ సప్లయిశాఖ నుంచి ధాన్యాన్ని దించుకొని నిర్ణీత కాలవ్యవధిలో రైస్ ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నప్పటికీ గోదాములు ఖాళీగా లేక పోవడంతో అధికారుల దృష్టికి సమస్యలను పలుమార్లు తీసుకెళ్లి విన్నవించుకున్నామని చెప్పారు. తమకు రైస్ డెలివరీ చేసేందుకు అలాట్‌మెంట్ ఇవ్వాల్సిందిగా చాలా సార్లు కోరినప్పటికీ వివిధ కారణాలను చూపుతూ అలాట్‌మెంట్ ఇవ్వలేదని అన్నారు. 2021 సంవత్సరానికి సం బంధించిన ధాన్యం ఉత్పత్తి ఎక్కువైనందున గోదాములు పూర్తిగా నిండిపోయినప్పటికీ కూడా అధికారుల ఒత్తిడి మేరకు మిల్లు ఆవరణ లోని ఖాళీ స్థలంలో ధాన్యం బలవంతంగా దించారని మంత్రికి వివరించారు. ఆ ధాన్యాన్ని కాపాడేందుకు సరైన రక్షణ చర్యలు చేపట్టినా కూడా ప్రభుత్వం నిర్ణీత కాలవ్యవధిలో బియ్యం తీసుకోకపో వడంతో ప్రకృతి వైపరీత్యాలతో కురిసిన భారీ వర్షాలకు ధాన్యం దెబ్బతిని నల్లరంగుగా మారి మొలకెత్తాయన్నారు. వానాకాలం ధాన్యం ఉండగానే యాసంగి ధాన్యం కూడా దిగుమతి చేశారని అన్నారు. ఇలా అనేక రకాలుగా రా రైస్ మిల్లర్లు ఇబ్బందులకు గురికావడమే కాకుండా నష్టపోయామని, సంస్థకు 100శాతం బియ్యం ఇచ్చినా కూడా పెనాల్టీ చెల్లించాలని జిల్లా అధికారులు మౌఖిక ఆదేశాలు జారీ చేస్తూ పెనాల్టీ చెల్లిస్తేనే 2024 వానాకాలం ధాన్యం అలాట్‌మెంట్ జారీ చేస్తామంటున్నారని పేర్కొన్నారు. పెనాల్టీ తో రోడ్డున పడతామని, 25 శాతం పెనాల్టీని రద్దు చేయాలని మంత్రి ద్వారా ప్రభుత్వాన్ని కోరారు.

ఇసుక అక్రమ నిల్వలపై దాడులు

» స్వాధీనం చేసుకున్న అధికారులు

» టెండర్ నిర్వహిస్తామని వెల్లడి

కోరుట్ల, జూన్ 21: మండలంలోని నాగులపేట గ్రామంలో అక్రమ నిలువలపై మైనింగ్, రెవెన్యూ అధికారులు దాడులు నిర్వహించారు. గ్రామ శివారులోని వ్యవసాయ క్షేత్రాలు, మామిడి తోటలతో పాటు గ్రామంలోని పలు చోట్ల ఉన్న అక్రమ ఇసుక నిలువలను గుర్తించిన అధికారులు వాటిని స్వాధీనం చేసుకున్నారు. గ్రామంలోని వివిధ ప్రాంతాలలో 168 ఇసుక కుప్పలు ఉన్నట్లు గుర్తించారు. గ్రామం నుంచి కోరుట్ల పట్టణంతో పాటు మండలంలోని వివిధ గ్రామాలకు ఈ గ్రామం నుంచి భారీగా అక్రమంగా ఇసుక తరలిస్తుంటారు. ఇసుక నిలువలు ఉన్నట్లు మైనింగ్ అధికారులకు పిర్యాదు చేయగా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మైనింగ్ అధికారి తిరుపతి రావు ఆధ్వర్యంలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రాజేందర్‌రావు పోలీసుల సహాయంతో దాడులు చేశారు. త్వరలో ఇసుకను టెండర్ వేయనున్నట్లు అధికారులు తెలిపారు.


అక్రమంగా నిల్వ చేసిన ఇసుక

తప్పుడు పత్రాలతో భూ కబ్జా

- ఐదుగురిపై కేసు నమోదు

- ఆలస్యంగా వెలుగుచూసిన ఘటన

రాయికల్, జూన్ 21: రాయికల్ పట్టణంలో తప్పుడు పత్రాలతో భూమిని కబ్జా చేసిన ఐదుగురిపై కేసు నమోదైన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. రాయికల్ మండలం వస్తాపూర్ గ్రామానికి చెందిన అనుపట్ల శ్రీనివాస్, అనుపట్ల పోచయ్యలు అన్నద మ్ములు కాగా, శ్రీనివాస్‌కు కుమారుడు ప్రశాంత్, భార్య లక్ష్మి ఉన్నారు. పోచయ్యకు సంతానం లేకపోవడంతో మేన కోడలు బూర్గుల శారదను పెంచుకున్నాడు. శ్రీనివాస్ 2010 లో రాయికల్ పట్టణంలో సర్వే నెం.1057/ఇ లో 637 చదరపు గజాల భూమిని కొనుగోలు చేశాడు. 2010, డిసెంబరు 10న అనారోగ్యంతో శ్రీనివాస్ మృతి చెందగా, అప్పటి నుంచి లక్ష్మి, తన కుమారుడు ప్రశాంత్‌తో కలిసి కొడిమ్యాల మండలం పూడూర్‌లో నివాసముం టుంది. కొన్ని సంవత్సరాలుగా శ్రీనివాస్ కుటుంబసభ్యులు రాయికల్‌కు రాకపోవడంతో భూ మిని సొంతం చేసుకోవాలని బూర్గుల శారద మరికొందరి సహకారంతో 2017లో జగిత్యాల మున్సిపాలిటీ నుంచి లక్ష్మి మృతి చెందినట్లు మరణ ధృవీకరణ పత్రం రాయికల్ తహసీ ల్దార్ కార్యాలయం నుంచి జారీ చేసినట్లు శ్రీనివాస్ వారసురాలిగా శారద అని తప్పుడు కు టుంబసభ్యుల ధృవీకరణ పత్రాలు సృష్టించారు. ఈ ఆధారాలతో జనవరి 5, 2024న డాక్యు మెంట్ నెం.106/2024, 107/2024 కట్కం సాయి కుమార్, అనుపట్ల పోచమ్మలకు రిజిస్ట్రేష న్ చేశారు. మారంపల్లి రవి కుమార్, పడిగెల నర్సింహా సాక్ష్యులుగా సంతకాలు చేశారు. ఈ పత్రాలతో భూమిని కబ్జా చేశారు. విషయం తెలుసుకున్న అనుపట్ల శ్రీనివాస్, భార్య లక్ష్మి, కుమారుడు ప్రశాంత్ తమ భూమి కబ్జాకు గురైందని ఆధారాలు సేకరించి రాయికల్ పోలీ స్స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, బూర్గుల శారద, అనుపట్ల పోచమ్మ, కట్కం సాయి కుమార్, మారంపెల్లి రవి కుమార్, పడిగెల నర్సింహా అనే ఐదుగురు వ్యక్తులపై ఈ నెల 8న కేసు నమోదైంది. తమ భూమిని తప్పుడు పత్రాలు సృష్టించి రిజిస్ట్రేషన్ చేసుకున్నవారిపై కఠిన చర్యలు తీసుకోవాలని బాధితులు కోరుతున్నారు

భూ తగాదాలతో వ్యక్తి ఆత్మహత్య

ఇల్లంతకుంట, జూన్ 21: మండలంలోని తిప్పాపూర్ గ్రామంలో భూ తగాదాతో గంద్ర నర్సింగరావు (65) పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసుల వివరాల ప్రకారం.. నర్సింగరావుకు తన అన్న గంద్ర సూర్యారావు, బోయినిపల్లి నర్సింగరావుకు మధ్య భూతగాదా ఏర్పడింది. సమస్య పరిష్కారం కాకపోవడంతో మనస్తాపం చెందాడు. బుధవారం ఇంట్లో పరుగుల మంది తాగి అపస్మారకస్థితికి చేరుకోగా ఎల్లారెడ్డిపేటలోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. చికిత్సపొందుతూ గురువారం అర్ధరాత్రి మృతిచెందాడు. బంధువుల ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సిరిసిల్ల రూరల్ సీఐ సదన్‌కుమార్, ఎస్సై రాజుగౌడ్ తెలిపారు.

దాడి ఘటనలో ముగ్గురిపై కేసు

ఎల్లారెడ్డిపేట, జూన్21: దాడి ఘటనలో ఎల్లారెడ్డిపేట మండల కేంద్రానికి చెందిన చింతకింది భాను, నిఖిల్, మరో యువకుడిపై కేసు నమోదు చేశామని స్టేషన్ హౌస్ అధికారి కిషన్‌రావు శుక్రవారం తెలిపారు. మండల కేంద్రంలోని కులేరి దీప్తి కుమార్ తన ఇంటికి వెళ్తున్న దారిలో ముగ్గురు యువకులు మూత్ర విసర్జన చేశారని పేర్కొన్నారు. దారిలో మూత్ర విసర్జన చేస్తే ఎలా అని ప్రశ్నించినందుకు దీప్తి కుమార్‌పై భాను, నిఖిల్, మరో యువకుడు దాడి చేశారని చెప్పారు. అక్కడే ఉన్న బీరు సీసాతో కొట్టి చంపి వేస్తామని హెచ్చరించినట్లు పేర్కొన్నారు. బాధితుడు దీప్తి కుమార్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

జిల్లా వ్యాప్తంగా నాకా బందీ

» అసాంఘిక శక్తుల కట్టడే ధ్యేయం

» ఎస్పీ అఖిల్ మహాజన్


సిరిసిల్లలో వాహనాలు తనిఖీచేస్తున్న ఎస్పీ అఖిల్ మహాజన్

సిరిసిల్ల క్రైం, జూన్ 21: శాంతిభద్రతల పర్యవేక్షణలో భాగంగా జిల్లా వ్యాప్తంగా పోలీసులు నాకాబందీ నిర్వహించారు. అసాంఘిక శక్తులు, అనుమానిత వ్యక్తులను కట్టడిచేసేందుకే జిల్లా వ్యాప్తంగా విస్తృత తనిఖీలు చేపట్టామని ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. శుక్రవారం సాయంత్రం సిరిసిల్ల పట్టణంలోని అంబేద్కర్‌చౌరస్తా, రగుడు చౌరస్తాలో ఎస్పీ అఖిల్ మహాజన్ వాహనాలను తనిఖీ చేశారు. జిల్లాలోకి వచ్చే అన్ని దారులలోనూ, మండల కేంద్రాల్లోనూ పోలీసు అధికారులు, సిబ్బంది ఏకకాలంలో ముమ్మర తనిఖీలు చేపట్టారు. ధ్రువపత్రాలు, నంబర్లు ప్లేట్లు లేని వాహనాలను సీజ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో సంఘటనలు చోటుచేసుకోకుండా ముందస్తు తనిఖీలు నిర్వహించామన్నారు. ప్రజల్లో భద్రతా భావాన్ని కల్పించడమే లక్ష్యమన్నారు. జిల్లాలో ఎవరైనా అనమానాస్పదంగా తిరిగితే డయల్ 100కు లేదా సమీపంలో ఉన్న పోలీస్‌స్టేషన్‌లో సమాచారం అందించాలన్నారు. కార్యక్రమంలో సిరిసిల్ల డీఎస్పీ చంద్రశేఖర్‌రెడ్డి, సిరిసిల్ల రూరల్ సీఐ సదన్‌కుమార్ పాల్గొన్నారు.

పీహెచ్‌డీ నోటిఫికేషన్ విడుదల చేయాలి

గణేశ్‌నగర్, జూన్ 21: పీహెచ్‌డీ నోటిఫికేషన్ విడుదల చేయాలని అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) శాతవాహన యూనివర్సిటీ శాఖ ఆధ్వర్యంలో ఎస్‌యూ రిజిస్టర్‌కు శుక్రవారం వినతిపత్రం ఆందజేశారు. ఈ సందర్భంగా వర్కింగ్ కమిటీ మెంబర్ జెల్లపల్లి అంజన్న మాట్లాడుతూ పీహెచ్‌డీ నోటిఫికేషన్ ఇవ్వని కారణంగా ఎంతో మంది విద్యార్థులు చదువులకు దూరం అవుతున్నారని ఆన్నారు. వెంటనే పీహెచ్‌డీ నోటిఫికేషన్ ఇవ్వాలన్నారు. యూజీసీ నెట్, సెట్, జేఆర్‌ఎఫ్, అర్హత సాధించిన విద్యార్థులు ఎంతోమంది నోటిఫికేషన్ లేక కూలి పనులు చేసు కుంటున్నారని దీని వెంటనే గ్రహించి నోటిఫికేషన్ వచ్చేలాగా చొరవ తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో కరీంనగర్ జిల్లా కన్వీనర్ విష్ణు, పీజీ విద్యార్థులు మహేష్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.


ఎస్‌యూ రిజిస్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఏబీవీపీ నాయకులు

స్వగ్రామానికి చేరిన వలస జీవి మృతదేహం


చంద్రయ్య(ఫైల్)

ఎల్లారెడ్డిపేట, జూన్ 21: ఎల్లారెడ్డిపేట మండలం నారాయణపూర్ గ్రామానికి చెందిన శీతాల చంద్రయ్య(55) మాల్దీవుల దేశంలో ఈ నెల 17న ప్రమాదవశాత్తు మృతి చెందడంతో ఆయన మృతదేహం శుక్రవారం ఇల్లు చేరింది. కుటుంబ పెద్ద విగత జీవిగా శవ పేటికలో చేరుకోవడంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా రోధించారు. కుటుంబ సభ్యులు, స్థానికుల కథనం మేరకు.. గ్రామంలోని చంద్రయ్య ఉన్న ఊరిలో ఉపాధి లేక గత 20 ఏళ్లుగా ముంబాయికి వలస వెళ్లాడు. అక్కడ అఫ్గాన్ కంపెనీలో పనులు చేస్తు జీవిస్తుండేవాడు. ఈ క్రమంలో అదే కంపెనీ మాల్దీవుల దేశంలో వంతెన నిర్మాణ పనులను చేపడుతోంది. దాంతో రెండేళ్ల కిందట చంద్రయ్య మాల్దీవుల దేశానికి వెళ్లాడు. నెల రోజుల కిందట అతని సోదరుడు నర్సయ్య అనారోగ్యంతో చనిపోయాడు. స్వగ్రామానికి వచ్చిన చంద్రయ్య అంత్యక్రియలు నిర్వహించి 15 రోజుల పాటు ఉండి తిరిగి పయనమయ్యాడు. ఈ నెల 17న వంతెన పనులు చేస్తున్న క్రమంలో రెండు క్రేన్ల మధ్య చిక్కుకుని చనిపోయాడు. నాలుగు రోజులకు చంద్రయ్య మృతదేహం ఇల్లు చేరడంతో కుటుంబ సభ్యుల రోధనలు మిన్నంటాయి. నెల రోజుల వ్యవధిలోనే ఇద్దరు అన్నదమ్ములు చనిపోవడంతో ఆ కుటుంబంలో విషాదం అలుముకుంది. మృతుడికి భార్య పోశవ్వ, వివాహమైన కూతురు భాగ్యలక్ష్మీలు ఉన్నారు. కాగా బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని స్థానికులు కోరారు.

ఆర్థిక ఇబ్బందులతో రైల్వే ఉద్యోగి ఆత్మహత్య


సీపీ శ్రీనివాస్(ఫైల్)

అంతర్గాం, జూన్ 21: రామగుండం పట్టణంలోని రైల్వేకాలనీకి చెందిన రైల్వే ఉద్యోగి సీవీ శ్రీనివాస్ ఆర్థిక ఇబ్బందులతో శుక్రవారం ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. రామగుండం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సీవీ శ్రీనివాస్ 30ఏళ్లుగా రామగుండం రైల్వే సీఅండ్‌డబ్ల్యూ డిపోలో పని చేస్తున్నాడు. పిల్లల ఉన్నత చదువుల కోసం అప్పులు చేసిన శ్రీనివాస్ ఇటీవల కాలంలో ఆర్థిక ఇబ్బందులతో సతమతవుతున్నాడు. దీంతో మనస్తాపం చెంది ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సీవీ శ్రీనివాస్ గతంలో వివిధ పత్రికలకు కథనాలను కూడా రాశారు. ఈ నేపథ్యంలో శ్రీనివాస్ మృతి వార్త తెలిసిన పలువురు పాత్రికేయులు మృతదేహానికి నివాళులర్పించారు. సీవీ శ్రీనివాస్‌కు భార్య అరుణ, కుమారుడు, కూతురు ఉన్నారు. మృతదేహానికి పంచనామా నిర్వహించిన రామగుండం ఎస్ఐ సతీష్ కుమార్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

పోగొట్టుకున్న బంగారు ఆభరణాలు అప్పగింత


తోట లక్ష్మికి బంగారు ఆభరణాలు అప్పగిస్తున్న డీఎం నాగభూషణం

కళ్యాణ్‌నగర్, జూన్ 21: గోదావరిఖని బస్‌లో ఈనెల 19న బంగారు ఆభరణాలు మరిచిపోయిన ప్రయాణికురాలు తోట లక్ష్మికి రూ.7లక్షల విలువైన బంగారు ఆభరణాలను శుక్రవారం ఆర్‌టీసీ డీఎం నాగభూషణం డిపోలో అప్పగించారు. గోదావరిఖని డిపోకు చెందిన టీజీ22జెడ్ 0013 ఎక్స్‌ప్రెస్ బస్సు సికింద్రాబాద్ నుంచి గోదావరిఖనికి వస్తుండగా సుల్తానాబాద్ వద్ద బస్సులో ఒక చేతి సంచిని గమనించిన కండక్టర్ శ్రీనివాస్ అందులో బంగారు ఆభరణాలు ఉన్నట్లు గుర్తించి డిపోకు వచ్చిన తరువాత అధికారులకు అప్పటించారు. రూ.7లక్షల విలువ చేసే 89గ్రాముల బంగారాన్ని ఓదెల మండలం కొలనూరు గ్రామానికి చెందిన తోట లక్ష్మి అనే ప్రయాణీకురాలివి గుర్తించారు. తగిన ఆధారాలతో డిపో అధికారులను సంప్రదించగా తిరిగి ఆ బంగారు ఆభరణాలు తోట లక్ష్మికి డీఎం నాగభూషణం అప్పగించారు. నిజాయితీగా ఆభరణాలు అప్పగించిన కండక్టర్ శ్రీనివాస్‌ను లక్ష్మి కుటుంబ సభ్యులు, తోటి కండక్టర్లు, డ్రైవర్లు అభినందించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ గీత కృష్ణ, డిప్యూటీ సూపరింటెండెంట్ సదానందం, సెక్యూరిటీ సిబ్బంది సత్యనారాయణ, అఖిల తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ గీత కార్మికుడు మృతి

ముస్తాబాద్, జూన్ 21: ముస్తాబాద్ మండలం చిప్పలపల్లికి చెందిన కంచర్ల దేవయ్యగౌడ్ తాటి చెట్టు పైనుంచి పడి తీవ్రగాయాలకు గురై ఆసుపత్రిలో చికిత్స పొందుతూ గురువారం రాత్రి మృతి చెందాడు. గ్రామానికి చెందిన దేవయ్యగౌడ్ కులవృత్తి చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఫిబ్రవరి 28వ తేదీన వృత్తిలో భాగంగానే తాటి చెట్టు ఎక్కి కల్లు గీస్తుండగా మోకు తెగిపోవడంతో కింద పడి తీవ్రగాయాలకు గురయ్యారు. గమనించిన కార్మికులు ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ నాలుగు నెలల తరువాత మృతి చెందాడు.

బావిలో పడి కూలీ మృతి

ధర్మపురి, జూన్ 21: మండలంలోని దమ్మన్నపేట గ్రామంలో శివరాత్రి మహేష్(25) అనే కూలీ వ్యవసాయ బావిలో పడి శుక్రవారం మృతి చెందాడు. గ్రామంలో జక్కుల రాజన్న అనే వ్యక్తి వ్యవసాయ బావి చుట్టూ తెట్టె కట్టే కూలి పనికి మహేస్ వెళ్లాడు. ప్రమాదవశాత్తు కాలు జారి బావిలో పడగా ఈత రాకపోవడంతో నీటిలో మునిగి మృతి చెందాడు. మృతుడి తండ్రి శివరాత్రి ఎల్లయ్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఉదయ్‌కుమార్ తెలిపారు.

దొంగల బీభత్సం

తంగళ్లపల్లి, జూన్ 21: దేశాయపల్లె మల్లాపూ ర్‌లో శుక్రవారం తెల్లవారుజామున దొంగలు బీభత్సం సృష్టించారు. మల్లాపూర్‌లో ఇంటి ఆవరణలో నిద్రిస్తున్న బాస ఎల్లవ్వ మెడలో మూ డు తులాల పుస్తెల తాడు ఎత్తుకెళ్లారు. అదే గ్రామానికి చెందిన తాటిపల్లి బాలకిషన్, ఎడ్ల రమేష్‌కు చెందిన రెండు సెల్ ఫోన్లు దొంగి లించారు. దేశాయిపల్లెకి చెందిన పర్శరాములు ఇంటి తాళం పగలగొట్టి రూ.4 వేల ఎత్తుకెళ్లారు. డీఎస్పీ చంద్రశేఖర్ రెడ్డి, ఎస్సై సుధాకర్ సంఘటన స్థలాలను పరిశీలించారు.

రూ.7,350 పలికిన పత్తి ధర

జమ్మికుంట, జూన్ 21: జమ్మికుంట వ్యవసాయ మార్కెట్లో క్వింటాల్ పత్తి ధర 7,350 రూపాయలు పలికింది. శుక్రవారం మార్కెట్ యార్డుకు 22మంది రైతులు 338క్వింటాళ్ల విడి పత్తి, నలుగురు రైతులు నాలుగు క్వింటాళ్ల గోనె సంచుల్లో విక్రయానికి తీసుకు వచ్చారు. ప్రైవేట్ ట్రేడర్స్ బహిరంగ వేలం పాట ద్వారా గరిష్ఠ ధర 7,350, కనిష్ఠ ధర 6,500 రూపాయలు చెల్లించి పత్తి కొనుగోళ్లు చేపట్టారు.

బదిలీ ఉద్యోగులకు సన్మానం

ఓదెల, జూన్ 21 :ఇటీవల కాల్వశ్రీరాంపూర్ మండలానికి బదిలి అయిన ఆర్ఐ రాజేందర్, మంథనికి బదిలి అయినా నర్సింగంలను శుక్రవారం రెవెన్యూ కార్యాలయ సమీపంలో ఘనంగా సన్మానించారు. బదిలీ అయిన స్థానంలో నూతనంగా నియామకమైనా ఆర్ఐలు మల్లేష్, రమేష్‌లను సిబ్బంది ఆహ్వానిస్తూ సన్మానించారు. ఇంఛార్జి తహసీల్దార్ అనిల్‌కుమార్, వీఆర్ఏలు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

గుంపులలో వైకుంఠధామం కూల్చివేత

ఓదెల, జూన్ 21 : మండలంలోని గుంపుల శివారులో నిర్మించిన వైకుంఠధామంను గురువారంరాత్రి కొందరు గుర్తు తెలియని వ్యక్తులు యంత్రాలతో నేలమట్టం చేశారు. 2021లో రూ.11లక్షల ఈజీఎస్ నిధుల వ్యయంతో వైకుంఠధామాన్ని నిర్మించారు. సంఘటనపై శుక్రవారం గ్రామపంచాయతీకార్యదర్శి పొత్కపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

మట్టి నమూనా సేకరణ

ఎలిగేడు, జూన్ 21: మండలంలోని నాగుపల్లిలో శుక్రవారం వ్యవసాయ శాఖ అధికారులు మట్టి నమూనాలు సేకరించారు. ఈసందర్భంగా ఏఈవో కిరణ్మయి మాట్లాడుతూ 2024-25లో భాగంగా ఇంప్లిమెంటేషన్ ఆఫ్ సాయిల్ హెల్త్ కార్డు మేనేజ్‌మెంట్ కింద జూలపల్లి మండల నాగులపల్లి గ్రామం సెలెక్ట్ అయ్యిందని తెలిపారు. మండల విస్తీర్ణం 20747కాగా 4088మట్టి నమూనాలు సేకరించాలి అందులో నాగులపల్లిలో 1022అనే ఆదేశాలు ఉన్నాయని ఆమె పేర్కొన్నారు. ఆమెతో పాటు రైతులు పాల్గొన్నారు.

బుధవారంపేట్‌లో పశుగ్రాసం దహనం

రామగిరి, జూన్ 21 : మండలంలోని బుధవారంపేట్ గ్రామంలో పెంద్రునారాయణరెడ్డి అనే రైతుకు సంబంధించిన పశుగ్రాసాన్ని గురువారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు దహనం చేశారు. సుమారు 150కట్టలకు నిప్పు అంటించినట్లు బాధితుడు తెలిపారు. సుమారు రూ. 10వేల నష్టం వాటిల్లి నట్లు అంచనా. శుక్రవారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నారు.

ఆదర్శ పాఠశాలలో ప్రవేశాలకు ఆహ్వానం

ముత్తారం, జూన్ 21: మండలంలోని దర్యాపూర్ గ్రామ పంచాయితీ పరిధిలోని ఆదర్శపాఠశాల, కళాశాలలో 6 నుంచి 10వ తరగతుల్లో, ఇంటర్మీడియట్ ఎంపీసీ, బైపీసీ, ఎంఈసీ, సీఈసీలలో మిగిలి ఉన్న సీట్ల భర్తీకి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు పాఠశాల ప్రిన్సిపాల్ రాజ్యలక్ష్మి ఓ ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని ఆమె కోరారు.

మచ్చుపేటలో కప్పతల్లి ఆట

ముత్తారం, జూన్ 21:మండలంలోని మచ్చుపేట గ్రామ పంచాయతీ పరిధిలో గ్రామస్తులు కప్పతల్లి ఆటను ఆడారు. సకాలంలో వర్షాలు కురవడం లేదని గ్రామస్తులు అందరూ కలిసి వరణదేవుని పూజించారు.

అందుబాటులో ఉండి సేవలందిస్తాం

పాలకుర్తి, జూన్ 21: బసంత్‌నగర్ కేశోరాం సిమెంటు కర్మాగారంలో ఇటీవల జరిగిన కాంట్రాక్టు గుర్తింపు సంఘం ఎన్నికల్లో అధ్యక్షుడిగా కౌశిక్ హరి, ప్రధానకార్యదర్శిగా మాదాసు శ్రీనివాస్‌లు ఎన్నికై గురువారం రాత్రి ఈసాలతక్కళ్ళపల్లికి రావడంతో బీఆర్ఎస్ శ్రేణులు,కార్మికులు,గ్రామస్తులు వారిని సత్కరించారు. హరి, శ్రీనివాస్‌లు మాట్లాడుతూ అనునిత్యం అందుబాటులో ఉంటూ కార్మికులకు సేవలందిస్తామని తెలిపారు. ప్రతి కార్మికునికి న్యాయం జరిగేలా చూస్తామని హామీ ఇచ్చారు.

వైభవంగా వట సావిత్రి పౌర్ణమి వ్రతం

మంథని, జూన్ 21: జ్యేష్ట శుద్ధ పౌర్ణమి సందర్భంగా స్థానిక పంజేరు కట్ట మర్రిచెట్టు కింద మహిళా భక్తులు వేదోక్తంగా వట సావిత్రి వ్రతాన్ని శుక్రవారం ఆచరించారు. మర్రిచెట్టు వట వృక్షము కింద సావిత్రి, సత్యవంతుని ప్రతిమలతోపాటు గొడ్డలి ప్రతిమను సైతం వటవృక్షం వద్ద ఉంచి భక్తిశ్రద్ధలతో పూజించారు. భక్తులు పాల్గొన్నారు.

శ్రీపాద కప్ టోర్నీ ప్రారంభం

మంథనిరూరల్, జూన్ 21: మండలంలోని గుంజపడుగు గ్రామంలో శ్రీపాద కప్ జీపీఎ-24 టోర్నమెంట్‌ను యూత్ కాంగ్రెస్ నేతలు ఎరుకల ప్రవీణ్, ఊదరి శంకర్‌లు శుక్రవారం ప్రారంభించారు. యూత్ కాంగ్రెస్ నేతలు ఆర్ల నాగరాజు, రేగళ్ళ రాము, మబ్బు శ్రీను, ఇందారపు సదయ్య, రాంపెల్లి సమ్మయ్య, మబ్బు శంకర్, ఎరుకల సురేష్, రమేష్‌బాబు, రేపాక శ్రీకాంత్, చారిలు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాన్ని పరామర్శించిన జడ్పీ చైర్మన్ పుట్ట మధు

మంథనిరూరల్, జూన్ 21: మండలంలోని లక్కేపూర్ గ్రామంలో ఇటీవల మృతి చెందిన తొగరి ప్రవళిక కుటుంబాన్ని శుక్రవారం జెడ్పీ చైర్మన్ పుట్ట మధు పరామర్శించారు. కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఆయన వెంట స్థానిక బీఆర్ఎస్ నేతలు పాల్గొన్నారు.

ఘనంగా యోగా దినోత్సవం



జిల్లా కేంద్రంలో..



ధర్మారంలో..



కమాన్‌పూర్‌లో..

పెద్దపల్లిటౌన్, జూన్ 21: పట్టణంలోని స్థానిక ప్రభుత్వ ఐటిఐ మైదానం వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పదవ అంతర్జాతీయ యోగా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి యోగా గురువు రవి వాకర్ అసోసియేషన్ సభ్యులందరికీ యోగా మరియు దాని యొక్క ఆవశ్యకత వివరించి అనంతరం సభ్యులందరికీ మొలకెత్తిన విత్తనాలు పండ్లు అసోసియేషన్ ఆధ్వర్యంలో అందించారు. అసోసియేషన్ అధ్యక్షుడు వెంకటరెడ్డి, ఉపాధ్యక్షుడు కొమ్ము జగన్, కార్యదర్శి వెంకటేశ్వరరావు, కోశాధికారి సంపత్‌రావు తదితరులు పాల్గొన్నారు.

పెద్దపల్లి రూరల్ : వ్యాయామంతో పాటు నిత్యం యోగా చేయడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని పెద్దపల్లి ఎంపీవో సుదర్శన్ అన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకోని మండలంలోని పెద్దబొంకూర్, ముత్తారం, సబ్బితం, హన్మంతునిపేట, రాంపల్లి, బొంపల్లిలో యోగా వేడుకలను నిర్వహించారు.పెద్దబొంకూర్‌లో ఉపాధిహామీ పనుల వద్ద నిర్వహించిన యోగా వేడుకల్లో ఎంపీవో సుదర్శన్ పాల్గొని యోగాసనాలు చేశారు.

కమాన్‌పూర్ : ప్రపంచ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని మండల వ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలో యోగా డే వేడుకలు జరిగాయి. గుండారంలో యోగా డేను పురస్కరించుకొని విద్యార్థులు యోగాసనాలు ప్రదర్శించారు. ప్రధానోపాధ్యాయులు రమణారెడ్డి, యోగా ఉపాధ్యాయులు టీ. మల్లయ్య, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ధర్మారం : మండల కేంద్రంలో శుక్రవారం అంతర్జాతీయ యోగా దినోత్సవం నిర్వహించారు. సాయి మణికంఠ పాఠశాలలో విద్యార్థులు యోగా ఆసనాలను వేశారు. కరస్పాండెంట్ జైన సురేష్‌కుమార్, ఎండీ రమాదేవి పాల్గొన్నారు. పూస్కూరి రామారావు నివాసంలో యోగాసనాలు వేశారు. శ్రీకృష్ణ అష్టంగా యోగా ఆధ్వర్యంలో గురుజీ సలీంను సభ్యులు సన్మానించారు. రాష్ట్రస్థాయి యోగా పోటీల్లో ప్రథమ బహుమతి పొందిన చెన్నెల్లి మల్లేశంను సన్మానించారు. యోగా గురుజీ సుధాకర్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు.

ధర్మారం : ప్రతి ఒక్కరూ యోగా చేయడం వలన సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని నందిమేడారం జూనియర్ సివిల్ కోర్టు జడ్జి ఎన్ వెంకట్ సచిన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం అంతర్జాతీయ యోగా దినోత్సవంను పురస్కరించుకుని ధర్మారం మండలం నంది మేడారం కోర్టు ఆవరణలో ఆసనాలు వేశారు. ఈ సందర్భంగా జడ్జి ఎన్ వెంకట్‌సచిన్‌రెడ్డి మాట్లాడుతూ యోగా చేయడం వలన ప్రయోజనాల గురించి విశదీకరించారు.బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నార అశోక్‌రెడ్డి, ప్రధానకార్యదర్శి అకారి రాజేశం,ఉపాధ్యక్షుడు బొట్ల లక్ష్మీనర్సయ్య, సహాయ కార్యదర్శి నూనే సత్యనారాయణ, స్పోర్ట్స్‌అండ్‌కల్చర్ కార్యదర్శి భీమారపు సంపత్‌కుమార్, సీనియర్ న్యాయవాది గడ్డం లింగారెడ్డి సూపరింటెండ్ కోమురయ్య, సిబ్బందిఉన్నారు.

సుల్తానాబాద్ : అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని సుల్తానాబాద్‌లో పలుచోట్ల యోగా వేడుకలను నిర్వహించారు. యోగా మాస్టర్ గంధం రాజేష్ యోగాకు సంబంధించి పలు ఆసనాలను చేసి చూపించారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో, పోస్టాఫీసులో, పలు విద్యాసంస్థల్లో యోగా దినోత్సవాన్ని జరుపుకున్నారు.

ఓదెల : ప్రపంచ యోగా దినోత్సవంలో భాగంగా మండలంలోని ఇందుర్తి యూపీఎస్ పాఠశాలలో శుక్రవారం విద్యార్థులు, ఉపాధ్యాయులు యోగాసనాలను వేశారు. అలగే పాఠశాలలో ఆరు రకాలుగా యోగాసనాలను విద్యార్థులకు నేర్పించారు. ప్రధానోపాధ్యాయురాలు రాధ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎలిగేడు : యోగాతో సంపూర్ణ ఆరోగ్య సిద్ధిస్తుందని మండల బీజేపీ అధ్యక్షుడు కోదాటి వెంకటరమణరావు అన్నారు. మండలంలోని లాలపల్లి మల్లికార్జు స్వామి ఆలయంలో యోగా అంతర్జాతీయ జాతీయ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. మండల ప్రధాన కార్యదర్శి గడ్డం సత్తిరెడ్డి, మండల ఉపాధ్యక్షుడు బద్దం మల్లారెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి, బీసీ మోర్చా అధ్యక్షుడు విజయభాస్కర్, బూత్ అధ్యక్షుడు సురేష్, తిరుపతి, శ్రీకాంత్, కార్యకర్తలు పాల్గొన్నారు.

జ్యోతినగర్ : అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని శుక్రవారం ఎన్టీపీసీలో ఘనంగా నిర్వహించారు. పీటీఎస్‌లోని జ్యోతి ఫంక్షన్ హాలులో జరిగిన యోగా దినోత్సవ కార్యక్రమాన్ని జీఎం ఎ.కె.త్రిపాఠి ప్రారంభించారు. ఉద్యోగులు, కుటుంబ సభ్యులు పాల్గొని యోగా విన్యాసాలు చేశారు. అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని విశ్వభారతి పాఠశాలలో నిర్వహించారు. విద్యా సంస్థల చైర్మన్ బందారపు యాదగిరిగౌడ్, యోగా దినోత్సవ వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులు, ఉపాధ్యాయులు యోగా ప్రదర్శన నిర్వహించారు.

ముత్తారం : మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలలలో యోగా దినోత్సవం పురస్కరించుకొని విద్యార్థులతో యోగాసనాలు చేయించారు.

మంథని : యోగను ప్రతి ఒక్కరూ మన దైనందిన జీవితంలో ఒక భాగంగా చేసుకోవాలి, ప్రతి రోజు యోగా చేయడం వల్ల మానసిక, శారీరక సమస్య దూరమవుతాయని జడ్పీ చైర్మన్ పుట్ట మధు అన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవ సందర్భంగా యోగ కార్యక్రమం కళాశాల మైదానంలో శుక్రవారం నిర్వహించారు. ఈకార్యక్రమంలో వాకర్స్ నాంపల్లి రమేష్, కనుకుంట్ల స్వామి, రావికంటి మనోహర్, ఇసంపల్లి కొమురయ్య, తాటి సమ్మయ్యగౌడ్, గంధం అంజీబాబు, నగేష్, చిలువేరి సతీష్, సబ్బని సంతోష్, వేల్పుల గట్టయ్య, విష్ణుభక్తుల రఘులు పాల్గొన్నారు.

కళ్యాణ్‌నగర్/మార్కండేయకాలనీ: యోగాతో మానసిక ఒత్తిళ్లు దూరంమవుతాయని బీజేపీ రాష్ట్ర మహిళా మోర్చ కార్యవర్గ సభ్యురాలు సోమారపు లావణ్య అన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా గౌతమినగర్ పార్కులో నిర్వహించిన యోగా కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. యోగాటీచర్ అన్నపూర్ణను ఘనంగా సన్మానించారు. గోదావరిఖని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో నిర్వహించిన యోగా కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రిన్సిపాల్ హిమబిందు హాజరయ్యారు. డీఎంహెచ్‌ఓ ప్రమోద్‌కుమార్, సూపరింటెండెంట్ దయాల్‌సింగ్, డిప్యూటీ డీఎంహెచ్ఓ కృపాబాయితో పాటు వైద్యులు పాల్గొన్నారు. గోదావరిఖని కోర్టులో నిర్వహించిన కార్యక్రమానికి జిల్లా 6వ అదనపు న్యాయమూర్తి టీ శ్రీనివాసరావు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. జూనియర్ సివిల్ జడ్జి కోర్టు న్యాయమూర్తి మంజుల, రెండవఅదనపు న్యాయమూర్తి వెంకటేష్, బార్ అసోసియేషన్ అధ్యక్షులు తౌటం శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి జవ్వాజి శ్రీనివాస్, సంజయ్‌కుమార్, రామటెంకి శ్రీనివాస్, పులిపాక ప్రవీణ్‌కుమార్, ఏట శ్రీనివాసరాజు, యోగా గురువు గణేష్ పాల్గొన్నారు.

కాల్వశ్రీరాంపూర్ : యోగా దినోత్సవం సందర్భంగా మండలంలోని ఎంపీడీఓ కార్యాలయంలో శుక్రవారం ఉద్యోగులు యోగా చేశారు. ఎంపీఓ గోవర్ధన్, ఎంపీడీఓ సూపరింటెండెంట్ సురేష్, ఏపీఓ మంజుల, సిబ్బంది సతీష్ పాల్గొన్నారు.



ఎన్టీపీసీలో..

కోల్‌సిటీటౌన్ : స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 9వ తెలంగాణ ఎన్‌సీసీ బెటాలియన్ ఆధ్వర్యంలో విద్యార్థులు, ఎన్‌సీసీ కేడెట్లకు యోగా శిక్షకురాలు స్వప్న అవగాహన కల్పించారు. యూనివర్సిటీ పీజీ కళాశా లలో ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో యోగా ప్రాక్టీ షనర్ అజయ్‌కుమార్ యోగాసనాలు వేయించారు.

మంత్రి శ్రీధర్‌బాబుపై ఆరోపణలు అర్ధరహితం

ముత్తారం, జూన్ 21: మంత్రి శ్రీధర్‌బాబు, సోదరుడు శీనుబాబులపై జడ్పీ చైర్మన్ పుట్ట మధు చేసిన ఆరోపణలు అర్ధరహిత మాజీ జడ్పీటీసీ చొప్పరి సదానందం, కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు దొడ్డ బాలాజీ ఖండించారు. మండలంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఇప్పటికైనా పుట్ట మధు ఆరోపణలు చేయడం మానుకోవాలని హెచ్చరించారు.

పాలకుర్తి, జూన్ 21: మంత్రి శ్రీధర్‌బాబు, ఆయన సోదరుడు శ్రీనుబాబుపై జడ్పీ చైర్మన్ పుట్ట మధు చేసిన ఆరోపణలు పస లేనివని డీసీసీ ప్రధానకార్యదర్శి సూర సమ్మయ్య అన్నారు. శుక్రవారం కాంగ్రెస్ పార్టీ శ్రేణులతో కలిసి పాలకుర్తి ప్రెస్‌భవన్‌లో సమ్మయ్య మాట్లాడారు. ఇప్పటికైనా పుట్ట మధు చౌకబారు ప్రకటనలు మానుకోవాలని హితవు పలికారు.

కమాన్‌పూర్, జూన్ 21 : నియోజకవర్గ అభివృద్ధి కోసం కృషి చేస్తున్న మం త్రి శ్రీధర్‌బాబు, ప్రభుత్వంపై జడ్పీ చైర్మన్ పుట్ట మధు చేస్తున్న వ్యాఖ్యలు అర ్ధరహితమని కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధానకార్యదర్శి గాండ్ల మోహన్, మండల ప్రధానకార్యదర్శి మల్యాల తిరుపతిలు అన్నారు. శుక్రవారం మండల కేంద్రం లోని ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. ప్రజాసేవ కులపై ఓర్వలేకనే నిరాధార ఆరోపణలు చేస్తున్నారని, కాళేశ్వరం ఎస్ఐ చేసిన లైంగిక దాడిని రాజకీయంగా వాడుకోవడం సిగ్గు చేటన్నారు.

మంథని, జూన్ 21: కాళేశ్వరం ఎస్సై భవానిసేన్ చర్యను ఖండించిన తమ నేత పుట్ట మధును సమర్ధించాల్సింది పోయి ఎదురు దాడి చేయడం సమంజ సం కాదని బీఆర్ఎస్ నేతలు మంథని లక్ష్మణ్, వేల్పుల గట్టయ్యలు అన్నారు. శుక్రవారం వారు విలేకరులతో మాట్లాడారు. దళిత మహిళపై జరిగిన దాడిని ఖండించాల్సిన కాంగ్రెస్ దళిత నాయకులు ఖండించకుండా మంత్రి శ్రీధర్‌బాబు మెప్పు కోసం తమ నేత పుట్ట మధును విమర్శించడం సరికాదన్నారు. పుట్ట మధు అనే నాయకుడు లేకుంటే కాంగ్రెస్ నాయకులకు పబ్బం గడవదని, తమ నాయకుడిని విమర్శిస్తే ఇకపై సహించేది లేదన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన



పెద్దకల్వలలో సీసీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే

పెద్దపల్లి రూరల్, జూన్ 21: మండలంలోని పెద్దకల్వలలో డీఎంఎఫ్‌టీ ద్వారా 10 లక్షల రూపాయలతో నిర్మించనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులకు ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు శుక్రవారం శంకుస్థాపన చేశారు. అలాగే బొంపల్లిలో ఈజీఎస్ నిధుల ద్వారా రూ.10 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డును ప్రారంభించారు. కార్యక్రమాల్లో జడ్పీటీసీ రాంమ్మూర్తి, మాజీ సర్పంచ్‌లు అరికిల్ల లక్ష్మయ్య, కారెంగల రమేష్, ఎంపీటీసీలు ఎడెల్లి శంకర్, జక్కుల రుక్కమ్మ, సింగిల్ విండో చైర్మన్ చింతపండు సంపత్, కాంగ్రెస్ నాయకులు వీరేశం, అర్కుటి సంతోష్, పెగడ రమేష్ పాల్గొన్నారు.

ఆయిల్‌పామ్ సాగుకు రైతులు ముందుకు రావాలి

ఎలిగేడు, జూన్ 21: ఆయిల్‌పామ్ పంటసాగుకు రైతులు ముందుకు రావాలని ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు పిలుపునిచ్చారు. మండలంలోని శివపల్లిలో శుక్రవారం తిరుమల ఆయిల్‌పామ్ కంపెనీ ప్రతినిధి బృందం ఎమ్మెల్యేను కలిసి పంట దిగుబడులు, ప్రభుత్వ సహాయం వివిధ అంశాలపై చర్చించారు. అనంతరం ఎమ్మెల్యేను శాలువాతో సత్కరించి బొకేలు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. ఉద్యానశాఖ ద్వారా సాగుచేస్తున్న ఆయిల్‌పామ్ సాగును రాష్ట్ర ప్రభుత్వం పెద్ద ఎత్తున ప్రోత్సహిస్తోందని, ఆయిల్‌పామ్ పంటసాగు చేసేందుకు రైతులు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఆయిల్‌పామ్ సాగుచేసిన రైతులకు సబ్సిడీలు వెంటనే ప్రభుత్వ ఇస్తుందని త్వరలోనే కాల్వశ్రీరాంపూర్ మండలంలోని పెద్దరాతుపల్లి గ్రామంలోని ఫ్యాక్టరీ ఏర్పాటు చేయనున్నామని ఆయన తెలిపారు. కార్యక్రమంలో సీఈవో కేసు కల్యాంకర్, కంపెనీ ప్రమోటర్ సిద్ధాంత, ఫీల్డ్ ఆఫీసర్ అభిలాష్ పాల్గొన్నారు.

ఎల్వోసీ అందజేత

పెద్దపల్లి రూరల్, జూన్ 21: మండలంలోని గుర్రాంపల్లి గ్రామానికి చెందిన మాదిరెడ్డి అభినవ్ అనారోగ్యంతో హైదరబాద్‌లోని నిమ్స్ ఆసుపత్రిలో చేరగా ఖర్చుల నిమిత్తం రూ2 లక్షల 50 వేల ఎల్వోసీని పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణరావు వారి కుటుంబ సభ్యులకు శుక్రవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ప్రదీప్‌తో పాటు నాయకులు , కార్యకర్తలు పాల్గొన్నారు.

వైభవంగా పోచమ్మ బోనాలు

ఎలిగేడు, జూన్ 21: మండలంలోని సుల్తాన్‌పూర్ గ్రామంలో పోచమ్మ బోనాలు, మడెలేశ్వరస్వామి పట్నాల ఉత్సవాలను శుక్రవారం వైభవంగా నిర్వహించారు. ఉత్సవాల్లో ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు పాల్గొని ప్రత్యేక మొక్కులు చెల్లించుకున్నారు. ఈసందర్భంగా ఆయనకు ఉత్సవాల కమిటీ భారీ స్వాగతం పలికి ఘనంగా శాలువాలతో సత్కరించారు. ఆయన వెంట కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు సామ రాజేశ్వర్‌రెడ్డి, యువజన కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి దుగ్యాల సంతోష్‌రావు, మాజీ సర్పంచ్ అర్షనపల్లి వెంకటేశ్వర్‌రావు, నాయకుడు కొండ తిరుపతిగౌడ్ తదితరులు ఉన్నారు.

ధర్నాను విజయవంతం చేయండి

కళ్యాణ్‌నగర్, జూన్ 21: మోదీ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈ నెల 24న ఛలో కలెక్టర్ ధర్నాను విజయవంతం చేయాలని ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు ఈ నరేష్ పిలుపునిచ్చారు. శుక్రవారం గోదావరిఖని గాంధీనగర్‌లోని ఐఎఫ్‌టీయూ కార్యాలయంలో ధర్నా కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూడో సారి అధికారంలోకి వచ్చిన ప్రధాని నరేంద్ర మోదీ నాలుగు లేబర్ కోడ్‌లను అమలు చేయడానికి ప్రయత్నం చేస్తున్నారన్నారు. దేశంలో ఖనిజ సంపదను కార్పొరేట్ శక్తులకు దోచిపెట్టడానికి కుట్రలు పన్నుతున్నారని ఆరోపించారు. రోజురోజుకు దేశంలో ధరలు పెరిగిపోయి సామాన్య ప్రజలు, కార్మికులకు జీవన మనుగడ భారమవుతుందని, నరేంద్ర మోదీ ప్రభుత్వానికి ప్రజలు బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ నాయకులు ఐ కృష్ణ, కొమురయ్య, ఎడ్ల రవికుమార్, తిప్పాని రాంకీ, అబెద్నెగో, దుర్గయ్య, సాంబయ్య, శ్రీకాంత్, శ్రీనివాస్, రాజయ్య పాలొన్నారు.

కార్పొరేట్ ఆసుపత్రులకు దీటుగా ప్రభుత్వాసుపత్రిలో వైద్యం

కళ్యాణ్‌నగర్, జూన్ 21: కార్పొరేట్ ఆసుపత్రులకు దీటుగా బోధనాసుపత్రి అయిన గోదావరిఖని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో రోగులకు వైద్య సేవలను అందిస్తున్నట్లు సింగరేణి మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ హిమబిందు, డీఎంహెచ్‌వో ప్రమోద్‌కుమార్ చెప్పారు. శుక్రవారం గోదావరిఖని జనరల్ ఆసుపత్రిలో అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ల వైద్యులు, ఏఎన్ఎంలు, ఆశావర్కర్లతో అవగాహన సదస్సును నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ బోధనాసుపత్రిలో రేషియో ప్రకారం ఐపీల సంఖ్య పెంచాలని, సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున రోగులకు అవగాహన కల్పించాలని, జనరల్ ఆసుపత్రిలో అన్నీ విభాగాల ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్లు,రెసిడెంట్ డాక్టర్లు అందుబాటులో ఉన్నారని, అర్బన్ హెల్త్ సెంటర్ల నుంచి రోగులు ప్రైవేట్ ఆసుపత్రులకు వెళ్లకుండా ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చేలా చూడాలన్నారు. ఇక్కడే అన్నిరకాల వైద్యసేవలు అందిస్తున్నట్టు, ఇన్‌పేషెంట్ల సంఖ్యను పెంచాలని వారు సూచించారు.

వివిధ రోగాలతో బాధపడుతున్న వారిని పరిష్కరించడానికి ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికి తీసుకువస్తే సెక్యూరిటీ సిబ్బంది ఇబ్బంది పెడుతున్నారని, తమకు రెస్ట్‌రూమ్‌ను ఏర్పాటు చేయాలని ప్రిన్సిపాల్ దృష్టికి ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు తీసుకువచ్చారు. రోగికి వైద్యసేవలు అందించడంలో ఒక్కోసారి సాయంత్రం వరకు ఉండాల్సి వస్తుందని, రెస్ట్ రూమ్‌ను ఏర్పాటు చేయాలని వారు కోరారు. సానుకూలంగా స్పందించిన ప్రిన్సిపాల్ సమస్యలు పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. అవగాహన సదస్సులో డిప్యూటీ డీఎంహెచ్‌వో కృపాబాయి, అర్బన్ హెల్త్ సెంటర్ల వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

చెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాలు ప్రారంభం



ఎమ్మెల్యే విజయరమణరావుకు స్వాగతం పలుకుతున్న అర్చకులు

ఓదెల, జూన్ 21: మండలంలోని కనగర్తి గ్రామంలో అతి పురాతన దేవాలయం చెన్నకేశవస్వామి క్షేత్రంలో శుక్రవారం బ్రహ్మోత్సవాలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా గ్రామస్తులు, ఉత్సవ నిర్వాహకులు, అర్చకులు ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావుకు పూర్ణకుంభంతో ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం ఎమ్మెల్యే ప్రత్యేకపూజలు నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామస్థులు కాంగ్రెస్ నాయకులు, భక్తులు పాల్గొన్నారు.

వైభవంగా రంగనాయకస్వామి రథోత్సవం

పెద్దపల్లి రూరల్, జూన్ 21: మండలంలోని శ్రీరంగనాయక స్వామి బ్రహ్మోత్సవాలు భాగంగా శుక్రవారం ఆలయ కమిటీ, గ్రామస్థుల ఆధ్వర్యంలో రథోత్సవం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఎమ్మెల్యే చింతకుంట విజయరమణరావు హాజరై స్వామివారిని దర్శించుకోని ప్రత్యేక పూజలు చేశారు. ఎమ్మెల్యే విజయరమణారావుకు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్థులు సత్కరించారు. సింగిల్‌విండో చైర్మన్ చింతపండు సంపత్, కౌన్సిలర్ నూగిళ్ల మల్లయ్య, వీరేశం, ప్రదీప్, మందల సత్యనారాయ ణరెడ్డి, తిరుపతిరెడ్డి, రమేష్‌రెడ్డి, లక్ష్మయ్య, ఎడెల్లి శంకర్, గుర్రాల రాజు, జడల రాజు పాల్గొన్నారు.



బొగ్గు గనుల వేలంపై నిరసనలు

యైటింక్లయిన్‌కాలనీ, జూన్ 21: బొగ్గు గనుల వేలం ప్రక్రియను వ్యతిరేకిస్తూ శుక్రవారం ఆర్జీ-2 పరిధిలోని గనులు, డిపార్ట్‌మెంట్లపై ఏఐటీయూసీ శ్రేణులు నల్ల బ్యాడ్జీలతో నిరసన వ్యక్తం చేశాయి. నాయకులు కార్మికులకు నల్లబ్యాడ్జీలను పెట్టారు. వేలంను నివేయాలని, ఎంఎండీఆర్ బిల్లును రద్దు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలోని బొగ్గు గనులను సింగరేణికి కేటాయించాలని నాయకులు డిమాండ్ చేశారు. సింగరేణికి తోడ్పాటు నిచ్చేలా గనుల కేటాయించాలని, ఈదిశగా రాష్ట్ర ప్రభుత్వం కేంద్రం మీద ఒత్తిడి తేవాలని నాయకులు డిమాండ్ చేశారు. యూనియన్ సెంట్రల్ వైస్ ప్రెసిడెంట్ ప్రకా ష్, నాయకులు రవీందర్, అన్నారావు, బుర్ర తిరుపతి, శ్యాంసన్, సాంబశివరా వు, మహేందర్, ఎజ్జ రాజయ్య, శంకర్, నారాయణ, రాజసాగర్, మహేందర్ పాల్గొన్నారు.

సింగరేణికి కేటాయించేలా చర్యలు తీసుకోవాలి

బొగ్గు బ్లాకల వేలంలో పాల్గొనకుండా తెలంగాణలోని గనులను సింగరేణికి కేటాయించేలా యాజమాన్యం తనవంతు కృషి చేయాలని కోరుతూ ఆర్జీ-2 పరిధిలోని గనులు, డిపార్ట్‌మెంట్లలో సంబంధిత అధికారులకు సీఐటీయూ నాయకులు వినతిపత్రాలను అందజేశారు. కేంద్ర ప్రభుత్వం బొగ్గు బ్లాక్‌ల వేలం ప్రక్రియను ఉపసంహరించుకోవాలని బ్రాంచి సెక్రెటరీ, ప్రెసిడెంట్లు కుంట ప్రవీణ్, వినయ్‌లు డిమాండ్ చేశారు. వేలంలో ఇతర కంపెనీలు, కార్పొరేట్ సంస్థలు గనులను దక్కించుకుంటే సింగరేణి మనుగడ ప్రమాదంలో పడుతుందని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం గనులను దక్కించుకునేలా కేంద్రంతో చర్చించాలని, కేంద్రం వేలంను రద్దు చేసేలా కార్మిక, ప్రజా సంఘాలు, పార్టీలు ఉద్యమించాల్సిన అవసరం ఉన్నదని ప్రవీణ్, వినయ్‌లు పేర్కొన్నారు.

సింగరేణి ఆసుపత్రులు నరక కూపాలు..

- మావోయిస్టు పార్టీ కోల్‌బెల్ట్ కమిటీ కార్యదర్శి ప్రభాత్

గోదావరిఖని, జూన్ 21: సింగరేణి వైద్యశాలలన్నీ నరక కూపాలుగా మారాయని భారత కమ్యూనిస్టు పార్టీ(మావోయిస్టు) సింగరేణి కోల్‌బెల్ట్ కమిటీ కార్యదర్శి ప్రభాత్ ఆరోపించారు. శుక్రవారం మీడియాకు పంపిన ప్రకటనలో సింగరేణి వైద్యరంగంపై, ఆసుపత్రులపై ప్రభాత్ తీవ్రమైన ఆరోపణలు చేశారు. భూగర్భ గనుల్లో ప్రకృతికి విరుద్ధంగా ప్రాణాపాయ పనిస్థలాల్లో విష వాయువుల మధ్య పని చేస్తున్న కార్మికులకు వైద్యం అందించడం పట్ల సింగరేణి వైద్యరంగం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నదన్నారు. పనిస్థలాలే కాకుండా కాలనీలు, బస్తీ లు, నివాస ప్రాంతా ల్లో కూడా వాయు కాలుష్యం, నీటి కాలుష్యంతో సింగరేణి కార్మిక కుటుంబాలు తీవ్ర అనారోగ్యాలకు గురవుతున్నాయని ప్రభాత్ అన్నారు. లాభాలే ధ్యేయంగా పనిచేస్తున్న యాజమాన్యం కార్మిక కుటుంబాల ఆరోగ్యాలకు ప్రాధాన్యతనివ్వడం లేదని, అరాచకాలకు పాల్పడుతున్నారన్నారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం : ఆర్జీ-1 జీఎం

గోదావరిఖని, జూన్ 21: యోగాతో సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని ఆర్‌జీ-1 జీఎం చింతల శ్రీనివాస్ అన్నారు. అంతర్జాతీయ యోగా దినో త్సవం సందర్భంగా శుక్రవారం ఆర్‌జీ-1 జీఎం కార్యాలయంలో అధికారులు, ఉద్యోగులతో యో గా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎస్‌ఓటూ జీఎం రాంమోహన్, ఏజీఎం లక్ష్మీనారాయణ, ఏఐటీయూసీ నాయకులు మడ్డి ఎల్లయ్య, పర్స నల్ మేనేజర్ కిరణ్‌బాబు పాల్గొన్నారు.



యోగా సాధన చేస్తున్న జీఎం, ఉద్యోగులు

ఆర్జీ-2లో..

యైటింక్లయిన్‌కాలనీ, జూన్ 21: అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని శుక్ర వారం ఆర్జీ-2 యాజమాన్యం ఘనంగా నిర్వహించింది. జీఎం కార్యాలయంలో జీఎం సూర్యనారాయణ ఉద్యోగులతో కలిసి యోగ ఆసనాలను వేశారు. ఈసందర్భంగా జీఎం మాట్లాడారు. ఏఐటీయూసీ బ్రాంచి సెక్రెటరీ రవీందర్, అధికారులు మధుసూదన్, వెంకటేశ్వరరావు, ధనంజయ, మరళీకృష్ణ, రాజేంద్రప్రసాద్‌లు పాల్గొన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఓసీపీ-1 బేస్‌వర్క్‌షాప్‌లో ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రాజెక్టు ఇంజనీర్ శ్రీనివాస్, ఇంచార్జి సత్యనారాయణ, జక్కుల దామోదర్‌రావు, శ్రీనివాస్ తో పాటు కార్మికులు పాల్గొన్నారు.

ఆర్జీ-3లో..

రామగిరి, జూన్ 21: యోగతోనే సంపూర్ణం ఆరోగ్యం పొందగలరని ఆర్జీ-3 జీఎం సుధాకర్ రావు అన్నారు. శుక్రవారం యోగా డేను పురస్కరించుకొని జేఎన్టీయూ ఇంజనీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. కళాశాల సిబ్బంది,విద్యార్థులతోయోగాసానాల్లో పాలుపంచుకున్నారు. అనంతరం జీఎం మాట్లాడారు. ప్రిన్సిపాల్ చెరుకు శ్రీధర్‌రెడ్డి, సీఐ వెంకటశ్వర్లు, ఆఫీసు సూపరింటెండెంట్ రవికుమార్, యోగా శిక్షకులు ముత్యాల బాలయ్య, డాక్టర్ శరణ్య, పీడీ కృష్ణారెడ్డి, సునీల్, కోఆర్డినేటర్లు తదితరులు పాల్గొన్నారు.

ఆర్జీ-3 జీఎం కార్యాలయం ఎదుట ధర్నా



జీఎంకు వినతిపత్రం అందిస్తున్న ఏఐటీయూసీ నాయకులు

రామగిరి, జూన్ 21: కేంద్ర ప్రభుత్వం బొగ్గు బ్లాక్‌ల వేలం వేయడాన్ని నిరసిస్తూ ఏఐటీయుసీ ఆధ్వర్యంలో శుక్రవారం జీఎం కార్యాలయం ఎదుట ఏఐటీయుసీ ధర్నా చేపట్టారు. కేంద్రప్రభుత్వనికి వ్యతిరేకంగా నినాదాలు చేపట్టారు. అనంతరం సింగరేణి బొగ్గు బ్లాక్ వేలం వేయడాన్ని వ్యతిరేకిస్తూ జీఎం సుధాకర్‌రావుకు వినతి పత్రం అందజేశారు. ఈ నిరసన కార్యక్రమంలో నాయకులు వై.వీరావు, జూపాక రాంచందర్, ఎంఆర్‌సీరెడ్డి, డీటీ రావు, గంగాధర్, వెంకట్, స్వామి, సంపత్, కుమార్, నరేష్, కెవిఎస్‌రెడ్డి, శ్రీనివాస్, నాయకులు పాల్గొన్నారు.

కోల్‌బ్లాకుల వేలంలో పాల్గొనవద్దు

కార్మిక సంఘాల ఐక్యవేదిక డిమాండ్

గోదావరిఖని, జూన్ 21: కోల్‌బ్లాక్‌ల వేలంలో రాష్ట్ర ప్రభుత్వం కానీ, సింగరేణి కానీ పాల్గొనరాదని సింగరేణి కార్మిక సంఘాల ఐక్య వేదిక డిమాండ్ చేసింది. శుక్రవారం స్థానిక చౌరస్తాలోని హెచ్ఎంఎస్ కార్యాలయంలో ఐక్య వేదిక సమావేశం జరిగింది. వేదిక కన్వీనర్ రియాజ్ అహ్మద్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో హెచ్ఎంఎస్ నుంచి జే నారాయణ, ఐఎఫ్‌టీయూ నుంచి ఐ కృష్ణ, ఈ నరేష్, టీఎస్‌యూఎస్ నుంచి కామెర గట్టయ్య, కుమారస్వామి, ఏఐఎఫ్‌టీయూ నుంచి జీ రాములు, ఎం రాయమల్లు, జీఎల్‌బీకేఎస్ నుంచి ఈ రామకృష్ణ, ఈ రాజేందర్, టీఎన్‌టీయూసీ నుంచి నిమ్మకాయల ఏడుకొండలు, దామోదర్‌రెడ్డి, కోటగిరి పాపయ్య పాల్గొన్నారు. సింగరేణి బొగ్గు బ్లాకుల వేలాన్ని అడ్డుకునేందుకు ఈ సందర్భంగా జేఏసీ నాయకులు పోరాట ప్రణాళికలు సిద్ధం చేశారు. జూలై 3వ తేదిన హైదరాబాద్ సోమాజీగూడ ప్రెస్‌క్లబ్‌లో మేధావులు, ట్రేడ్ యూనియన్లతో ఈ అంశంపై సమావేశం నిర్వహించేందుకు నిర్ణయం తీసుకున్నారు. సింగరేణి నల్ల బంగారాన్ని కార్పొరేట్ శక్తులకు ఇస్తే ఊరుకోమని డిమాండ్ చేశారు. బొగ్గుబ్లాకుల అంశంపై ఎంతటి పోరాటానైనా నిర్వహిస్తామని, బొగ్గు బ్లాకుల ప్రైవేటీకరణను అడ్డుకుంటామని, సింగరేణి భవిష్యత్‌ను కాపాడుకుంటామని వారు పేర్కొన్నారు.